# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | ఆదివారం 18 ఆగస్టు 2024 తెలుగు దినపత్రిక




## సీఎం అరెస్ట్ తప్పదా..?

- సిద్ధారామయ్య మెడకు 'ముడా'
- కుంభకోణం విచారణకు గవర్నర్ అనుమతి..
- అత్యవసరంగా భేటీ అయిన కర్ణాటక కేబినెట్..
- అనుమానాలకు బలాన్నిస్తున్న సమావేశం

2



తుమ్మల లెక్క..

22,37,848 ఖాతాలకు 17933.19 కోట్ల నిధులు

మొదటి పంటకాలంలోపే రైతు సంక్షేమానికి రూ.26,140.13 కోట్లు

3292 బ్రాంచులు (35 బ్యాంకులు), 909 పీఏసీఎస్‌ల నుంచి వివరాల సేకరణ..

42 లక్షల ఖాతాలు పాస్ బుక్ ఉండి ఆధార్ నంబరు తప్పుగా, రుణంలో అసలు కన్నా వడ్డీ ఎక్కువ ఉన్నవి

జులై 18 లక్షలోపు రుణాలున్న 11,50,193 ఖాతాదారులకు 6098.93 కోట్లు

రెండో విడతలో లక్షయాభై వేల వరకు రుణాలున్న 6,40,823 ఖాతాదారులకు 6190.01 కోట్లు

మూడో విడుతలో 2 లక్షలలోపు రుణాలున్న 4,46,832 ఖాతాల్లో రూ.5644.24 కోట్ల నిధులు జమ

మూడు విడతల్లో 22,37,848 ఖాతాలకు 17933.19 కోట్ల నిధులు



# రుణం.. రణం.. ఏది నిజం

## పార్టీల మధ్య లెక్కల యుద్ధం..

రుణమాఫీపై సవాళ్లు ప్రతిసవాళ్లు.. | చిలికిచిలికి గాలి వానగా ఇష్యూ... | తారాస్థాయికి మాఫీ లొల్లి..

### కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ ▪ రీసెంట్ గా బీజేపీ ఎంట్రీ...

రైతు రుణమాఫీ కయ్యానికి ఆజ్యం పోసింది. అన్నదాత ముందు మార్కులు కొట్టేయాలనే ఆతృత అమ్మనా బూతులు తిట్టుకునే వరకు తీసుకెళ్లింది. వాళ్లు ఒక్కటిస్తే మేము రెండిస్తున్నామనే హామీ పార్టీల మధ్య కుంపటిని రాజేయగా.., చేస్తున్న పనిలో మంచిని వదిలి చెడునే వెతుకుతున్నారనే పరస్పర ఆరోపణలు కొట్లాటను పెంచి పోషిస్తున్నాయి. గత సర్కార్ లెక్కలకు, ప్రస్తుత ప్రభుత్వపు వివరాలకు పొంతన కుదరక జగడం పెద్దగవుతుంటే., దక్కిన వారు సంబురంగా, దక్కని వారు అన్యాయమైందనే ఆవేదనతో తలాఓ వైపు చేరి లొల్లికి బలం చేకూరుస్తున్నారు. రాష్ట్రంలో రైతు రుణం బీఆర్ఎస్ కు కాంగ్రెస్ కు మధ్య మాటల యుద్ధాన్ని చేయిస్తుండగా, నేతలు పాత పెంకలు తోడుకుంటూ నవ్వుల పాలవుతున్నారు. 2



హరీష్ రావు లెక్క..

అసెంబ్లీ ప్రచారంలో రూ.40000 కోట్ల రుణ మాఫీ. మొదటి సారీ మాట తుస్సు..

పార్లమెంట్ ప్రచారంలో రూ.31000 కోట్లు చేస్తాం.. మళ్లీ అంతే..

బడ్జెట్ లో కేటాయింపు కేవలం రూ.26000 కోట్లే..

మాఫీ చేసింది మొత్తం కేవలం రూ.17000 కోట్లు. లబ్ధిదారులు 22లక్షల మంది.

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.23 వేల కోట్ల కోత

క్యాబినెట్ మీటింగ్ నాడు, పార్లమెంట్ ఎన్నికల నాడు చెప్పిన రూ.31వేల కోట్లతో పోలిస్తే రూ.14వేల కోట్ల కోత

బడ్జెట్ కేటాయింపుల్లో రూ.26000 కోట్లతో పోలిస్తే రూ.9000 కోట్లు కోత. రైతుల సంఖ్య 47లక్షల నుంచి 22 లక్షలకు కుదింపు.

సుమారు 25 లక్షల మంది రైతులకు ఎగనామం

# విచారణకు వస్తా..

## చట్టాన్ని గౌరవిస్తా..



జనపదం, హైదరాబాద్:

మహిళా కమిషన్ విచారణకు తాను తప్పకుండా హాజరవుతానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తాను చట్టాలను గౌరవిస్తానని, అందుకే ఉదయం 11 గంటలకు మహిళా కమిషన్ ఎదుట విచారణకు వెళ్తానన్నారు. అదే సమయంలో రాష్ట్రంలో గత తొమ్మిది నెలలుగా అంటే కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి నుంచి జరిగిన మహిళలపై జరిగిన దాడుల వివరాలను కూడా కమిషన్ కు అందజేస్తానన్నారు.

**ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సర్కార్ సొమ్ము..**

సిద్ధిపేటలో హరీశ్ రావు క్యాంప్ ఆఫీస్ పై దాడిని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు ప్రభుత్వ ......(తరువాయి 2లో)

- కమిషన్ ముందు హాజరవుతా..
- 9 నెలల్లో మహిళలపై జరిగిన దాడుల వివరాలు అందజేస్తా..
- హరీష్ రావు క్యాంప్ ఆఫీస్ ప్రజల సొమ్ము..
- దాడి చేసిన వారిపై కేసులు ఎందుకు పెట్టలేదు..
- చిట్ చాట్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..



# ఆందోళన వద్దు..

- అర్హులైన రైతులు తప్పకుండా న్యాయం
- అనుమానాల నివృత్తికి వ్యవసాయాధికారిని కలవాలి..
- నెల రోజుల్లో దరఖాస్తులన్నింటికి పరిష్కారం..
- రుణమాఫీ పై వ్యవసాయ శాఖ ప్రకటన

2



# దాడి వెనుకెవరు...?

- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుకే దిక్కులేదు..
- సామాన్యుడి పరిస్థితి ఏంటి..?
- సిద్దిపేట ఘటనపై బీఆర్ఎస్ ఫైర్..
- పట్టణంలో టెన్షన్ వాతావరణం...
- బీఆర్ఎస్ పై 23, కాంగ్రెస్ శ్రేణులపై 20 కేసులు నమోదు..

3

ప్రశాంత వాతావరణం వేడెక్కిందెందుకు..? ప్రశ్నాబదులుల సమీకరణం, చించివేత వరకెందు కెళ్లినట్టు..? రుణమాఫీ కేంద్రంగా మొదలైన ముసలం., ఉక్కిరిబిక్కిరి చేసే వరకు తీసుకెళ్లింది. స్వార్థపు పొరమాటున 'మాఫీ'యా పార్టీల నిజరూపాన్ని బయటపెడుతున్నది. లెక్కల బొక్కలు., విప్పుకోలేని చిక్కులతో బీఆర్ఎస్, కాంగ్రెస్ తేల్చుకునే పనిలో పడ్డాయి. పర్యావసనమే సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడి. హరీశ్ పై కోపమో., బీఆర్ఎస్ పై ఆగ్రహమోగానీ ప్రజాధనాన్ని నాశనం చేయడానికి పురిగొల్పిందెవరు.? ఆఫీస్ పై మూకలు విరుచుకుపడే ధైర్యాన్ని కల్పించింది ఎందుకు..? వెనకున్నది ఎవరు..? నటిస్తూ నాటకాలడుతున్నది ఎందుకు..?

# మహిళల వార్..

- తాజా.. వర్సెస్ మాజీ ..
- ముదురుతున్న మాటల యుద్ధం..
- కేటీఆర్ ఎపిసోడ్ పై వాగ్వాదం..
- కౌంటర్లు.. ఖండనలు..
- అటు సీతక్క, సురేఖ., ఇటు సబిత, సునిత..

3



# ఫ్యూచర్ సిటీపై సీఎం కుస్తీ..

## సిటీ అభివృద్ధికి ప్రణాళికలు..

- అధికారులతో సమాలోచనలు..
- పలు విషయాలు, రూట్ మ్యాప్ పై సలహాలు..
- త్వరగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశాలు..
- తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు..
- స్పోర్ట్స్ అకాడమికీ సన్నాహాలు..

జనపదం, హైదరాబాద్:

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ నగరాలకు దీటుగా మరో కొత్త నగరాన్ని నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. దీన్ని నాలుగేళ్లలో పూర్తి చేస్తామన్న ఆయన..ఆ దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరం నుంచి ఆ ఫోర్త్ సిటీకి రవాణా సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది. దీనిపై సమీక్షా సమావేశం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఫ్యూచర్ సిటీకి రహదారి, మెట్రో రైలు మార్గాన్ని నిర్మించాలని అధికారులకు సూచించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి రూట్‌మ్యాప్‌ను అధికారులు సీఎంకు వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు – ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు ఆర్ఆర్ఆర్ వరకు ఈ మెట్రో మార్గం అనుసంధానం ఉండేలా మ్యాప్ ఉండాలని ......(తరువాయి 2లో)




# కమిషన్... క్రాస్ ఎగ్జామిన్.. కేసీఆర్..

అటు కాళేశ్వరం.. ఇటు కరెంట్..

'దూకుడు పెంచిన కమిషన్లు..

- పెద్దయనకు 'కాళేశ్వరం' నోటీసులు...?
- విచారణకు వచ్చేనా..?
- అఫిడవిట్లు దాఖలు చేసిన అధికారులు..
- కేసీఆర్ కు ఆప్షన్ ఇవ్వకుండా ఎంక్వేరీ చేయాలనే యత్నం..?

2



## రన్నింగ్‌లో ఊడిన బస్సు టైర్లు..

150 మంది ప్రయాణీస్తుండగా ఘటన..!

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రాణనష్టం

జగిత్యాల జిల్లాలో ఘటన

3




## దసరా నుంచి స్కిల్ యూనివర్సిటీ క్లాసులు

- 20 కోర్సులు నిర్వహణ
- తాత్కాలిక భవనంలో క్లాసులు
- 140 కంపెనీలు భాగస్వామ్యం అయ్యేందుకు ఆసక్తి
- సీఎస్ శాంతికుమారి

3

# రుణం.. రణం..

## ఏది నిజం..?




- పార్టీల మధ్య లెక్కల యుద్ధం..
- రుణమాఫీపై సవాళ్లు ప్రతిసవాళ్లు
- చిలికిచిలికి గాలి వానగా ఇష్యూ
- తారాస్థాయికి మాఫీ లొల్లి..
- కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్
- రీసెంట్‌గా బీజేపీ ఎంట్రీ...

**జనపదం, బ్యూరో:** రైతు రుణం చుట్టే రాజకీయం గిరగిరా తిరుగుతున్నది. అధికారం దుర్వినియోగమని బీఆర్ఎస్ దుయ్యబడుతుంటే.., అడ్డగోలుగా మాట్లాడు తున్నారని కాంగ్రెస్ కౌంటరిస్తున్నది. మూడు విడతల మాఫీ పర్వంలో పొంతన లేని లెక్కలు.., స్పష్టత లేని మాటలు., రోజురోజుకో కొత్త చిక్కులతో ఇరు పార్టీలు దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. జూన్ 21వ తేదీన కేబినెట్ సమావేశం అనంతరం మాట్లాడిన సీఎం మాట తీరు నుంచి ఆగస్టు 15 వరకు మూడు విడత లుగా జరిగిన మాఫీ ప్రక్రియలో ప్రతి రోజు ఓ ప్రత్యేకం గానే మారగా.., ప్రతి లెక్కా నిందకు ఆధారంగానే తయారైంది.

### లెక్కలు..చిక్కులు..

బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య జరుగుతున్న రుణమాఫీ ఫైట్ ఆరోపణలు, ప్రత్యారోపణలుగా సాగుతూనే ఉంది. లెక్కల్లోని చిక్కులు ప్రతిపక్షానికి బలంగా మారగా, అధికార కూటమికి గుక్కతిప్పుకోకుండా చేస్తున్న పరిస్థితి. రుణమాఫీ ప్రక్రియ ప్రారంభం నుంచి ప్రభుత్వం తగ్గిస్తూ వస్తున్న నిధులు., ప్రతిపక్షం అదెందుకు అని అడుగుతున్న తీరు ఆలోచించే విధంగానే మారాయి.

### లెక్కల వివరాలు చూస్తే...

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీకి కట్టుబడి ఉన్నామని, రూ.2 లక్షలు ఒకే విడుతలో చేస్తామని మొదటి నుంచి చెబుతూనే వచ్చింది. రాష్ట్రంలోని రైతులు డిసెంబర్, 2023 నాటికి రూ.49,500 కోట్ల రుణాలు తీసుకున్నారని ప్రకటించింది. తదనంతరం జూన్ 21వ తేదీన కేబినెట్ మీటింగ్ ముగిసిన అనంతరం ఒఖే విడుతల రుణమాఫీ చేయబోతున్నా మని మొత్తంగా 47 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్ల అవసరం ఉందని తెలిపారు. అదే విషయాన్ని స్వయంగా జూలై 18వ తేదీన రుణమాఫీ ప్రక్రియ ప్రారంభిస్తూ సీఎం మరోమారూ చెప్పారు. కాగా, రుణమాఫీ కోసం బడ్జెట్ లో మాత్రం రూ.26000 కోట్లు కేటాయించారు. కానీ, మూడు విడతలుగా రుణ మాఫీలో కేవలం సుమారు రూ.17,934 కోట్లు విడుదల చేసి పని ముగించారు.

### రుణమాఫీపై సవాళ్లు ప్రతిసవాళ్లు..

ఎన్నికల వేళ హామీ ఇచ్చినంత తేలిక కాదు., నెరవేర్చ డానికి నానా ఇబ్బందులు పడాల్సి ఉంటుందని ప్రతిపక్షం ప్రభుత్వాన్ని హెచ్చరికతో కూడిన దెప్పిపొ డుపూ ఇస్తూనే ఉంది. మరీ ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావు రుణమాఫీ విషయమై సాధ్యాసాధ్యాలను ప్రజలకు చేరవేడానికి లెక్కలేసి మరీ చూపడం., ప్రభుత్వం చెబుతున్న అవాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తుండడంతో పార్టీల మధ్య వార్ వాతావరణం రాజుకుంది. రూ.2 లక్షల రుణమా ఫీని ఒకే విడతలో చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీష్ ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ, ఒకే విడత సాధ్యం కాదని గ్రహించిన సర్కార్ మూడు విడతల్లో చేసి చూపుతామని, అప్పుడు మాట్లాడుదామని ఒకదశలో సవాల్ ను స్వీకరించిన ట్టుగా సంకేతాలు ఇచ్చింది. సరే మాఫీ అయితే చూద్దాం అన్నట్టుగా హరీష్ సవాల్, రేవంత్ ప్రతిసవాల్ నడుస్తూనే ఉన్నాయి. ఆగస్టు 15వ తేదీతో మూడు విడతల్లో మాఫీ పూర్తి చేశాం.., ఇక రాజీనామా చేయాల్సిన బాధ్యత హరీశ్ పైనే ఉందని కాంగ్రెస్ శ్రేణులు విరుచుపడడం మొదలు పెట్టాయి.

### చిలికిచిలికి గాలి వానగా...

హరీష్ రావు ఎలాగైనా పదవికి రాజీనామా చేసి మాట నిలుపుకోవాలని స్వయంగా సీఎం వైరా వేదిక నోటికొ చ్చినట్టు మాట్లాడి ఇష్యూకు మరింత ఆజ్యం పోశారు. దానికి వివరణగా హరీష్ రావు కూడా ఘాటుగానే స్పందించారు. అయితే గియితే రుణమాఫీకి నిధులు పెరగాలి.., లేదంటే కనీసం గతంలో ఉన్నంతవరకైనా ఉండాలిగానీ., మునుపటితో పోల్చితే మరింత తగ్గడ మేంటని ప్రశ్నించారు. యేటేటా రైతులు పెరగడం., రుణాలు తీసుకున్నవారు ఎక్కువవడం జరుగుతుంటే, మాఫీ మాత్రం ట్రైన్ రివర్స్ అన్నట్టుగా నానాటికి తగ్గడ మేంటని నిలదీశారు. దీంతో ఇరు పార్టీల మధ్య వ్యవహారం చిలికిచిలికి గాలివానగా మారింది.

### తారాస్థాయికి మాఫీ లొల్లి..

రుణమాఫీ లొల్లి ఇప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల లొల్లిగా కాకుండా పర్సనల్ ఆరోపణ వరకు వెళ్లింది. ఒకరి తప్పులను మరొకరు తవ్వుకుంటూ దుమ్మెత్తిపో సుకుంటున్నారు. రైతులకు అన్యాయం జరిగిందని బీజే పీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి కూడా ప్రభుత్వాన్ని తప్పుబడుతుండడంతో జగడం మరింత ముదురు తోంది. సీఎం రేవంత్ రెడ్డి స్థాయికి తగ్గట్టుగా మాట్లాడడం లేదని, మోసపూరిత లెక్కలతో ప్రజలను మభ్యపెట్టడానికి చూస్తున్నాడని ఆరోపిస్తున్నారు. రుణమాఫీ సక్రమమని నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమని ఆయన ముఖ్యమంత్రికే సవాల్ విసిరారు. రెండు పార్టీల మధ్య లొల్లి., ఇప్పుడు బీజేపీ కూడా ఎంటర్ కావడంతో మరింత మందమవుతున్నది. రుణమే రణంగా సాగుతున్న తీరులో అన్ని పార్టీలు తలా ఓ చేయి వేసి లాక్కెళ్లుతున్న తీరుకు ముగింపు ఎప్పుడో..?

## ఫ్యూచర్ సిటీపై సీఎం కుస్తీ..

(మొదటిపేజీ తరువాయి)ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో రేడియల్ రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కొత్త హైకోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో సర్వీసుల ప్రణాళికలు సైతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు, మెట్రో మార్గాలకు భూ సేకరణపై వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రంగారెడ్డి జిల్లాలోని బెగరికంచ ప్రాంతాన్ని.. ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి చేయనుందని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లో ఉండే ప్రజలు ఎలా ఉంటారో.. బెగరికంచలో ఉండే వాళ్లు కూడా గొప్పలు చెప్పుకునే విధంగా ఈ ఫ్యూచర్ సిటీ నిర్మాణం ఉంటుందని రేవంత్ రెడ్డి చెప్పారు. బెగరికంచె సిటీకి విదేశాల నుంచి రూ.వేల కోట్ల పెట్టబడులు తెచ్చి హెల్త్, స్పోర్ట్, ఇతర కంపెనీలకు హబ్‌గా మారుస్తామని స్పష్టం చేశారు.

### యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ..

హైదరాబాద్ లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోన్న ఫ్యూచర్ సిటీ(ఫోర్త్ సిటీ)లో నిర్మించే స్పోర్ట్స్ హబ్ లో దీన్ని ఏర్పాటు చేస్తారు. దాదాపు 12 వివిధ క్రీడల అకాడమీలను ఇందులో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో అంతర్జా తీయ స్థాయి అధునాతన మౌలిక సదుపాయాలు ఉంటాయి. ఈ స్పోర్ట్స్ హబ్ లో స్పోర్ట్స్ సైన్స్ సెంటర్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ కూడా అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తారు. కొత్తగా స్థాపించిన స్కిల్ యూనివర్సిటీ తరహాలోనే తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీకి "యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ" అనే పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనువైన స్థలంగా ప్రస్తుతం హకీంపేటలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్ లేదా గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పరిశీలిస్తున్నారు. సదరు క్యాంపస్ ను ఒలింపిక్స్ స్థాయి అంతర్జాతీయ ప్రమాణాలుండేలా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇటీవల దక్షిణ కొరియా పర్యటనలో కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని ని సందర్శించారు. ఇది ప్రపంచంలోనే పేరొందిన స్పోర్ట్స్ యూనివర్సిటీ గా ప్రత్యేకత చాటుకుంది. ఈ నేపథ్యంలోనే భవిష్యత్ ఒలింపిక్ ఛాంపియన్లకు శిక్షణ ఇచ్చేలా తెలంగాణ యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీకి సాంకేతిక భాగస్వాములుగా కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ సేవలు వాడుకో వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

## కమిషన్... క్రాస్ ఎగ్జామిన్.. కేసీఆర్..

- అటు కాళేశ్వరం.. ఇటు కరెంట్..
- 'దూకుడు పెంచిన కమిషన్లు..
- పెద్దయనకు 'కాళేశ్వరం' నోటీసులు...?
- విచారణకు వచ్చేనా..?
- అఫిడవిట్లు దాఖలు చేసిన అధికారులు..
- కేసీఆర్‌కు ఆప్షన్ ఇవ్వకుండా ఎంక్వైరీ చేయాలనే యత్నం..?



**జనపదం, హైదరాబాద్:** కాళేశ్వరం విచారణ కమిషన్ దూకుడు పెంచింది. కాళేశ్వరం ఆన కట్టల అంశాలపై విచారణ చేస్తున్న జస్టిస్ పీసీఘోష్ కమిషన్ త్వరలోనే గత ప్రభుత్వ పెద్దలకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ప్రాణహిత – చేవెళ్లను కాదని కాళేశ్వరం ప్రాజెక్టు రీ–డిజైనింగ్, రీ–ఇంజినీరింగ్, నిర్మాణ స్థలం ఎంపిక, విధానపర నిర్ణయాలు, సంబంధిత అంశాలపై గత ప్రభుత్వ పెద్దలను కమిషన్ ప్రశ్నించే అవకాశాలు కనిపిస్తు న్నాయి. శుక్రవారం హైదరాబాద్ వచ్చిన జస్టిస్ పీసీఘోష్ శనివారం నుంచి విచారణ తదుపరి ప్రక్రియను ప్రారంభించారు. కాళేశ్వరం నిర్మాణంలో పనిచేసిన అధికారులు, ఇంజినీర్లు, విశ్రాంత అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధుల నుంచి కమిషన్ ఇప్పటికే అఫిడవిట్లు తీసుకొంది. ఇప్పటి వరకు 50కి పైగా అఫిడవిట్లు కమిషన్‌కు అందాయి. గతంలో సీఎస్‌గా పనిచేసిన ఓ అధికారి నుంచి ఇంకా అఫిడవిట్ అందలేదని సమాచారం. ఇప్పటి వరకు వచ్చిన అఫిడవిట్లను విశ్లేషించిన కమిషన్ వాటి ఆధారంగా తదుపరి విచారణ కొనసాగించనుంది. అఫిడవిట్లు దాఖలు చేసిన అధికారులను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది. ఇందుకోసం వారికి మరోసారి సమన్లు జారీ చేయను న్నారు. క్రాస్ ఎగ్జామినేషన్, సాక్ష్యాల నమోదు ప్రక్రియను కొనసాగిస్తారు. సాంకేతిక అంశాలపై విచారణ దాదాపుగా ఓ కొలిక్కి వచ్చిందని, ఇక నుంచి ఆర్థిక అంశాలపై కమిషన్ దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఇక ఇదిలా ఉంటే కరెంట్ కొనుగోళ్ల వ్యవహారంలో కూడా కమిషన్ విచారణ వేగిరం చేసింది. కేసీఆర్ ను విచారించడానికి పావులు కదుపుతున్నట్టు సమాచారం.

## విచారణకు వస్తా..

**(మొదటిపేజీ తరువాయి)** ఆస్తులని, వాటిని కాపాడుకో వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆఫీస్ పై దాడికి పాల్పడిన వారిపై ఎందుకు కేసులు పెట్టలేదో కూడా చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### రుణమాఫీ సగమే..

రాష్ట్రంలో కేవలం 40 శాతం మంది రైతులకే రుణమాఫీ అయ్యిందని కేటీఆర్ అన్నారు. సుమారు 50 లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉన్నా, కేవలం 22 లక్షల మంది అన్నదాలకే మాఫీ జరిగిందన్నారు. రైతులంద రికీ న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామన్నారు.

### రిబ్బన్ కటింగ్సే..

గతంలోనే ఫాక్స్ కాన్ సంస్థతో బీఆర్ఎస్ సర్కార్ ఒప్పందం చేసుకుందని, ఒక దశ కూడా పూర్తి అయిందని కేటీఆర్ అన్నారు. 25 వేల మందికి ఉద్యోగాలు కూడా రాబోతున్నా యని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు మాదిరిగానే ఫాక్స్ కాన్ ను కూడా రిబ్బన్ కట్ చేసి తామే చేశామని చెబుతారని కేటీఆర్ పేర్కొన్నారు.



## కుటుంబ కలహాలు..

### ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్య

**జనపదం, పటాన్ చెరు:** కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. సిద్దిపేట జిల్లా ములుగుకు చెందిన మర్కంటి భాను ప్రియ(28) కుటుంబ కలహాలతో, రెండు రోజుల క్రితం తన ఇద్దరు పిల్లలని తీసుకొని ఇంట్లోంచి వెళ్లిపోయింది. శనివారం రాత్రి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట చెరువు నీటిలో భానుప్రియ, కుమార్తె దీక్ష(4) మృతదేహాలు లభ్యం అయ్యా యి. వారు ములుగుకు చెందిన భానుప్రియ, ఆమె పిల్లలేనని పోలీసులు గుర్తించారు. కుమారుడు వేదాన్ష్ ఆనంద్(5) మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## సీఎం రేవంత్‌వి డైవర్ట్ రాజకీయాలు..

### బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**జనపదం, హైదరాబాద్:** రెండు లక్షల రూపాయల రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ అసలు రూపం బయటపడిందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రుణమాఫీ విషయాన్ని డైవర్ట్ చేసేందుకు బీఆర్ఎస్, బీజేపీ విలీనం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త నాటకాలాడుతు న్నారని ధ్వజమెత్తారు. బీజేపీ ఏం చేసిన ప్రజాస్వామ్య పద్ధతిలో ఉంటుందన్న ఆయన, లోకల్ బాడీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఇలాంటి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ విలీనానికి బీజేపీ ఎందుకు ఒప్పుకుంటుందని ప్రశ్నించిన ఏలేటి, అంత అవసరం తమకు లేదని పేర్కొ న్నారు. పూర్తి రుణమాఫీ ఎప్పుడు చేస్తారో చెప్పాలని డిమాం డ్ చేశారు. రైతు భరోసా ఇవ్వకుండా స్థానిక ఎన్నికలకు ఎలా వెళ్తారని ఏలేటి నిలదీశారు. రైతులందరికి రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటా నని, లేదంటే మీరు రాజకీయ సన్యాసం చేస్తారా అని బీజేపీ శాసనసభాపక్ష నేత సీఎంను ఉద్దేశించి సవాల్ విసిరారు.

### అర్హుల జాబితా రిలీజ్ చేయాలి

రుణమాఫీ అయిన అర్హుల జాబితాను వెంటనే బయటపెట్టా లన్నారు. పెట్టుబడి సహాయాన్ని రుణమాఫీకి ఉపయోగించా రని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. రైతు భరోసా ఎందుకివ్వ డంలేదని ఎప్పటిలోపు ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుందంటే, అందరికీ రుణమాఫీ కాలేదని ఒప్పుకుంటున్నట్లే కదా? అని అన్నారు. మీరు చెప్పిన గ్రామానికే వెళ్లి, ఎంతమంది రైతులకు రుణమాఫీ అయ్యిందో వారినే నేరుగా అడుగుదామని, ఇందుకోసం మీరు వస్తారా? మీ వ్యవసాయ శాఖ మంత్రి వస్తారా? రండి అని సీఎంకు ఏలేటి సవాలు విసిరారు. లక్ష రూపాయల రుణమాఫీకి గతంలో రూ.19,000 కోట్లు అవ సరమైతే, ఇప్పుడు రూ.2 లక్షల రుణమాఫీకి రూ.17,933 కోట్లతో ఏ రకంగా రుణమాఫీ చేయగలిగారని, దీని ఫార్ములా ఏమిటో ప్రజానికానికి చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## ఆందోళన వద్దు.. న్యాయం చేస్తాం..

- రుణమాఫీ కానివారి వివరాలు సేకరిస్తాం..
- సమస్యాత్మక ఖాతాల బాధ్యత వ్యవసాయాధికారిదే..
- రైతుల ఇంటికే వెళ్లి వివరాలు తీసుకుంటాం..
- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



**జనపదం, హైదరాబాద్:** రుణమాఫీకి అర్హత ఉన్న రైతులందరికీ న్యాయం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం ఆయన మీడి యాతో మాట్లాడుతూ.. మూడు విడతలలో మొత్తం 22,37,848 ఖాతాలకు 17933.19 కోట్ల నిధులు విడుదల చేశామన్నారు. రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని పదేపదే చెప్పామని మంత్రి తుమ్మల తెలిపారు. కేవలం కుటుంబ నిర్ధారణకు మాత్రమే దానిని పరిగణలోనికి తీసుకున్నామని, 2 లక్షలలోపు రుణాలు ఉండి, రేషన్ కార్డు లేనివారు, ఆధార్ కార్డు వివరాలు తప్పుగా నమోదైనవారు మరే ఇతర కారణాలతో రుణమాఫీ వర్తించ ని వారు వారికి దగ్గరలో ఉండే వ్యవసాయ అధికారిని సంప్రదిస్తే కారణం తెలుస్తుందన్నారు. దానిని బట్టి తగిన రికార్డులు సమర్పిస్తే వారికి కూడా త్వరలో రుణమాఫీ వర్తింపజేస్తామన్నారు. ఇప్పటికే వ్యవసా యాధికారులందరికీ ఆదేశాలు జారీ చేశా మని, సమస్యాత్మక ఖాతాలకు పూర్తి బాధ్యత ఆ మండల వ్యవసాయాధికారి తీసుకుంటారని చెప్పారు.

### రైతు ఇంటికే అధికారులు

రైతు కుటుంబ నిర్ధారణ కోసం మండల వ్యవసా యాధికారి స్వయంగా రైతు కుటుంబాల దగ్గరికి వెళ్లి ఖాతాదారులు, వారి కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ వివరాలు తీసుకుని పోర్టల్ లో అప్ లోడ్ చేస్తారని మంత్రి తెలిపారు. ఒకవేళ రుణ ఖాతాలో నమోదైన పేరు, ఆధార్‌లో నమోదైన పేరుతో సరిపోలకపోతే ఖాతాదారుని దగ్గర సరైన వివరాలు సేకరించి పోర్టల్ లో అప్ లోడ్ చేస్తార న్నారు. ఒకవేళ బ్యాంకు సమర్పించిన అసలు, వడ్డీలలో తేడా ఉంటే ఖాతాదారుడు వ్యవసాయాధి కారికి తెలియజేయాలని సూచించారు. ప్రతి జిల్లా వ్యవసాయాధికారి జిల్లా వ్యాప్తంగా రోజువారి అందిన ఫిర్యాదులను సాయంత్రం 5 గంటలలోపు డైరెక్టర్, వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపిస్తా రని, అదేవిధంగా కొన్ని బ్యాంకుల నుంచి సాంకేతిక సమస్యల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70,000 నుండి 80,000 లోపు ఖాతాల కు సంబంధించి వివరాలు కూడా తెప్పించుకుంటు న్నామని పేర్కొన్నారు. వీటిని పరిష్కరించడానికి రా ష్ట్రస్థాయిలో అధికారుల బృందం చర్యలు తీసు కుం టుందన్నారు. మొదటి, రెండు విడతలలో త ప్పులు దొర్లిన 7,925 ఖాతాలను సరిచేసి 44.95 కో ట్లు నిధులు ఇప్పటికే విడుదల చేశామని తెలిపా రు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2 లక్షల కంటే పైన తీ సుకొన్న రుణఖాతాలకు సంబధించి ఖాతాదారుడు 2 లక్షల పైన ఉన్న మొత్తాన్ని బ్యాంకులలో జమ చేస్తే రుణమాఫీ పథకాన్ని వర్తింపజేయడానికి చర్య లు తీసుకొంటామన్నారు. ప్రభుత్వం రుణమాఫీపై చిత్తశుద్ధితో ఉందని, రైతులను అయోమయానికి గురిచేసే విధంగా ప్రతిపక్ష నాయకులు ప్రవర్తిం చడం దురదృష్టకరమన్నారు. ఒకవేళ నిజంగా రైతు సంక్షేమాన్ని కోరేవారే అయితే ముందుగా గత పది సంవత్సరాలలో చెల్లించకుండా, వదిలేసిన రుణాలు వివరాలు తెప్పించుకొని చెల్లించాలని సూచించారు.

## సీఎం అరెస్ట్ తప్పదా..?

- సిద్ధారామయ్య మెడకు 'ముడా'
- కుంభకోణం విచారణకు గవర్నర్ అనుమతి..
- అత్యవసరంగా భేటి అయిన కర్ణాటక కేబినెట్..
- అనుమానాలకు బలాన్నిస్తున్న సమావేశం



**జనపదం, బ్యూరో:** కర్ణాటక రాజకీయాల్లో ముడా కుంభకోణం పెను సంచలనంగా మారింది. ముడా భూముల కేటాయింపు వ్యవహారం ప్రస్తుతం.. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చుట్టూ ఉచ్చులా బిగు సుకుంటుండటంతో కర్ణాటక రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో సీఎంపై విచారణ చేపట్టేందుకు శనివారం గవర్నర్ అనుమతి మంజూరు చేయడంతో.. సిద్ధరామయ్యను అరెస్ట్ చేస్తారనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే సీఎం సిద్ధరామయ్య.. కర్ణాటక కేబినెట్‌ను అత్యవసరంగా భేటీకి పిలవడం ప్రస్తుతం మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది. ఈ నేపథ్యం లోనే ముడా కుంభకోణం వ్యవహారంలో సీఎంపై విచారణకు అనుమతించడంతో తదుపరి ఏం చర్యలు తీసుకోవాలనే దానిపై కర్ణాటక మంత్రివర్గం సమాలోచనలు చేయనుంది. అయితే కర్ణాటకలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ మొత్తం సిద్ధ రామయ్యకు మద్దతుగా నిలుస్తోంది.

### కాంగ్రెస్ ఫైర్..

మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూముల కేటాయింపు వ్యవహారం.. ఇప్పుడు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మెడకు చుట్టుకుంది. ఈ వ్యవహారా నికి సంబంధించిన కేసులో సిద్ధరామయ్యను విచా రించేందుకు కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అనుమతి మంజూరు చేయడంతో కర్ణాటకలో తీవ్ర చర్చకు దారి తీసింది. భారత్ నాగరిక్ సురక్ష సంహితలోని అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17 కింద ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించేం దుకు గవర్నర్ అనుమతి మంజూరు చేశారు. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ భగ్గుమంది. కర్ణాట కలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని.. హస్తం పార్టీ నేతలు తీవ్ర ఆరో పణలు గుప్పిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఏం చేయాలనే దానిపై సిద్ధరామయ్యతో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా మాట్లాడినట్లు తెలుస్తోంది. మరోవైపు తనపై గవర్నర్ అనుమతిని సవాల్ చేస్తూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించే ఆలోచనలో సీఎం సిద్ధరా మయ్య ఉన్నట్లు సమాచారం.

### భార్యకు 14 ఇళ్ల స్థలాలు..

మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూముల కుంభకోణం విషయంలో.. ముగ్గురు వ్యక్తులు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులను స్వీక రించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్.. సీఎంపై విచారణకు అనుమతి మంజూరు చేసినట్లు రాజ్‌భవన్ ఒక లేఖను విడుదల చేసింది. కాగా ముడాకు సంబంధించి 14 ఇళ్ల స్థలాలను సీఎం సిద్ధరామయ్య తన భార్యకు కేటాయించారన్నది ఆయనపై ఉన్న ప్రధాన ఆరోపణ.

### పార్టీ అండగా ఉంది

ఇదే విషయంపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకు మార్ స్పందించారు. పార్టీ , ప్రభుత్వం మొత్తం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు అండగా ఉందని తెలిపారు. సిద్ధరామయ్య ఏ తప్పు చేయలేదని పేర్కొ న్నారు. అసలు కేసే లేని చోట వివాదం చేస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. దీనిపై తాము న్యాయప రంగా ముందుకు వెళ్తామని వెల్లడించారు. గవర్నర్ వైఖరికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన తెలుపుతారని పేర్కొన్నారు.

## శభాష్ సీతక్క

### ప్రశంసించిన మాజీ మంత్రి గీతా రెడ్డి



**జనపదం, హైదరాబాద్:** శభాష్ సీతక్క.. మంత్రిగా బాగా పనిచేస్తున్నావ్.. స్టైల్ ఆఫ్ ఫంక్షనింగ్ బాగుంది. ఇదే ఒరవడిని కొనసాగించు. మంచి పేరు వస్తుంది. కొత్తగా మంత్రివైనా.. మీ నేతృత్వంలో పంచాయతీరాజ్ గ్రామీ ణాభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖల పనితీరులో కొత్తదనం కనిపి స్తోంది... అంటూ మాజీ మంత్రి గీతారెడ్డి మంత్రి సీతక్కను ప్రశంసించారు. మాదాపూర్ లో రూరల్ విమెన్ లీడర్షిప్ ప్రోగ్రాం ప్రారంభ సందర్భంగా.. గీతా రెడ్డి అభినందించడంతో సీతక్క ధన్యవాదాలు తెలిపారు.



## మెటల్స్, నాన్ మెటల్స్‌పై సింగరేణి దృష్టిసారించాలి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**జనపదం, హైదరాబాద్:** సింగరేణి ఇతర మైనింగ్ రంగాల్లో విస్తరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. అంబేద్కర్ సచివాలయంలో సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, అభివృద్ధిపై జరిగిన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి సంప్రదాయ ఇంధన వనరులకు కాలం చెల్లుతోందని.. భవిష్యత్ అంతా విద్యుత్ బ్యాటరీలే కేంద్రంగా మారబోతున్నాయ న్నారు. ఈ పరిస్థితుల్లో లిథియం, అనేక మూలకాల అన్వేషణ, వాటిని వెలికితీయడంపై సింగరేణి దృష్టి సారించాలన్నారు. సింగరేణి సంస్థ తన మనుగడను కొనసాగిస్తూ ఆస్తులను, సంపదను సృష్టించుకోవాలని సూచించారు. తద్వారా రాష్ట్ర ప్రజల సంపదైన సింగరేణి ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన జరుగుతుందని డిప్యూటీ సీఎం చెప్పారు. సింగరేణి సంస్థ మెటల్స్, నాన్ మెటల్స్ మైనింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా విస్త రించాలన్నారు. ఇందుకు అవసరమైతే ఓ కన్సెల్టెన్సీని నియమించుకోవాలని అధికారు లకు స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీలో భాగంగా రాష్ట్రంలో ఫ్లోటింగ్ సోలార్, పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహకాలు చేస్తున్నట్లు అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. ఇందుకు సంబంధించి పూర్తి డీపీఆర్‌లు రూపొందిస్తున్నామని.. త్వరలోనూ వాటిని ప్రభుత్వానికి అందిస్తామని విక్రమార్కకు వివరించారు. ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో బొగ్గు ఎప్పటినుంచి ఉత్పత్తి ఆరంభిస్తారని భట్టి ఆరా తీశారు. సమీక్షా సమావేశంలో ఎనర్జీ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సెక్రెటరీ కృష్ణభా స్కర్, సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ పాల్గొన్నారు.

## ఐదురోజులు.. భారీ వర్షాలు..

**జనపదం, హైదరాబాద్:** రాష్ట్రంలో రాగల ఐదురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆగ్నేయ అరేబియా సముద్రం, పరిసర ప్రాంతాలను ఆనుకొని దక్షిణ కేరళ తీరం మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక, పరిసరాల్లో ఉందని.. సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించిందని వాతావరణశాఖ పేర్కొంది. కొంకణ్ నుంచి ఆగ్నేయ అరేబియా సముద్రం వరకు ఉన్న ద్రోణి.. ప్రస్తుత ఉత్తర కర్ణాటక, ఇంటీరియర్ కర్ణాకట నుంచి కొమోరియన్ ప్రాంతం వరకు దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక మీదుగా ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం నుంచి మంగళవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రిసిఇల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబగ గద్వాల జిల్లాల్లో వానలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

# పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం

- అర్హులందరికీ పట్టాలు మంజూరు చేస్తాం
- వివాద పరిష్కారానికి కలెక్టర్ నేతృత్వంలో కమిటీలు
- పెండింగ్ దరఖాస్తుల క్లియర్ కు చర్యలు
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- మంత్రి సీతక్క ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష



**జనపదం, హైదరాబాద్ :** పోడు భూముల సమస్యలపై అధికారులు లోతైన అధ్యయనం చేపట్టి, లోటుపాట్లను వెలికితీసి, పోడు భూముల సమస్యలన్నింటికి శాశ్వత ముగింపు పలికేలా మార్గదర్శకాలను రూపొందించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. అటవీ అధికారులకు, గిరిజనులకు మధ్య నెలకొన్న ఘర్షణను నివారించి, సహృద్భావ వాతావరణ నెలకొనేలా విధివిధానాలు రూపొందించాలని మంత్రి ఉన్నతాధికారులకు సూచించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో పోడు భూముల సమస్యల పై సమీక్షా సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా పోడు భూములు విస్తరించి ఉన్న నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పలు జిల్లాల కలెక్టర్ల, ఐటీడీఏ పీవోలు, డీఎఫ్ఓలు తదితరులతో మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటివరకు ఆయా జిల్లాల్లో పంపిణీ చేసిన పోడు భూముల వివరాలు, పోడు హక్కులు, తగాదాలు, అడవులు ఆక్రమణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ పోడు భూముల సమస్య పై సమగ్ర అధ్యయనం చేసి పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని అధికారులను ఆదేశించారు. పోడు భూములు ఎన్ని ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి ? ఎంతమందికి పోడు పట్టాల పంపిణీ జరిగింది? పోడు పట్టాలు పొందిన వారిలో అనర్హులెవరైనా ఉన్నారా ? స్వీకరించిన దరఖాస్తులు ఎన్ని? తదితర అంశాల పై ఆయా జిల్లాల కలెక్టర్లు సునిశిత పరిశీలన చేపట్టి నివేదిక రూపొందించాలని సూచించారు. ఇప్పటివరకు పంపిణీ చేసిన పోడు భూముల వివరాలను మంత్రి సురేఖ అధికారులను ఆరా తీయగా, ఇండివిడ్యువల్ ఫారెస్ట్ రైట్ (ఐఎఫ్ఆర్) కింద 6,51,822 దరఖాస్తులు రాగా 2,30,735 మంది పట్టాదారులకు 6,69,676 ఎకరాల పోడు భూమి పంపిణీ ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కమ్యూనిటి ఫారెస్ట్ రైట్స్ (సీఎఫ్ఆర్) కింద 3,427 దరఖాస్తులు రాగా, 721 దరఖాస్తుదారులకు పట్టాలు అందించగా, పలు కారణాలతో 1,024 దరఖాస్తులను పెండింగ్ లో పెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పోడు భూముల పై హక్కుల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు ఆన్లైన్ లో నమోదుకావాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. తిరస్కరించిన దరఖాస్తుల విషయంలో తిరస్కరణకు కారణాలను వివరించాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. పోడు భూముల సమస్యల పరిష్కారం దిశగా ఆదర్శవంతమైన విధివిధానాలను రూపొందించాక, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించి, మార్గదర్శకాలకు ఆమోదం లభించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి సురేఖ అటవీశాఖ ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు.

**పరిష్కారానికి కమిటీ...**

అటవీ భూములు, రెవెన్యూ భూముల విషయంలో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు కమిటి వేసి సమస్యను పరిష్కరించాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఇతర సాంప్రదాయ అటవీ నివాసుల (ఓటీఎఫ్ డీ) కేటగిరీలో పోడు భూములు పొందిన గిరిజనేతర లబ్ధిదారుల వివరాలను పునః పరిశీలించాలని మంత్రి సురేఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

**పెండింగ్ దరఖాస్తుల క్లియర్ కు కమిటీలు**

అడవులు, గిరిజనుల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ఆయా జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏలు పీవోలు, డీఎఫ్ఓలు సామరస్యపూర్వకంగా, సమన్వయంతో మంత్రి సీతక్క వ్యవహరించాలని సూచించారు. అటవీ భూముల్లో మౌలిక సౌకర్యాల కల్పన సమయంలో అడవుల రమణీయత దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పోడు పట్టాల కోసం దరఖాస్తుదారులను పదే పదే తిప్పుకోవడం సరికాదన్నారు. పోడు పట్టాలు ఇచ్చేందుకు అర్హత లేకపోతే అదే విషయాన్ని దరఖాస్తుదారులకు వివరించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్టీలు, అటవీ శాఖ సిబ్బంది మధ్య ఘర్షణ వాతావరణాన్ని నివారించేలా చర్యలు చేపట్టాలన్నారు. కొత్తగా అడవులు నరకకుండా ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. అడవుల్లో పండ్ల మొక్కలను పెంచి స్థానికులకు ఉపాధి అవకాశాలు పెంచడం ద్వారా.. అడవుల అందరికీ వేతనం నివారించవచ్చు అన్నారు. అడవుల నరికివేతకు అడవి బిడ్డలే కారణమన్న అభిప్రాయాన్ని మార్చుకోవాలన్నారు. అడవి బిడ్డలున్న చోటే అడవులు భద్రంగా ఉన్నాయన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించాలని కోరారు. ఏజెన్సీ ఏరియాలో రహదారుల నిర్మాణానికి, విద్యుత్ లైన్లను, మౌలిక వసతుల కల్పనకు, కేంద్ర నిబంధనలు ఆటకంగా మారాయని, అడవులను కాపాడుకుంటూనే ఆదివాసి గిరిజనుల అభివృద్ధిని ఆకాంక్షించేలా నిబంధనలను సడలించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సమీక్షా సమావేశానికి హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్ తో పాటు, ఆర్మూల్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ తదితరులు వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా గిరిజనుల పోడు భూముల హక్కులు, అడవుల ఆక్రమణ, అటవీ భూముల గుండా రవాణాకు సంబంధించి తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి కొండా సురేఖతో ప్రస్తావించారు. ఈ సందర్భంగా అటవీభూముల సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అటవీ అధికారులను మంత్రి సురేఖ మందలించారు. దీని పై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు ప్రస్తావించిన సమస్యలను ఆయా జిల్లాల పరిధిలోని కలెక్టర్లు, డీఎఫ్ఓలు సమన్వయంతో వ్యవహరిస్తూ పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు, మానుకోట ఎమ్మెల్యే మురళీ నాయక్, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్ఎం డోబ్రియాల్, పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్) ఏలుసింగ్ మేరు, సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్, డిప్యూటీ సెక్రటరీ శ్రీలక్ష్మి, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ ఎ.శరత్, ట్రైబల్ వెల్ఫేర్ అడిషనల్ డైరక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, ట్రైబల్ కల్చరల్ రీసర్చ్ అండ్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ జాయింట్ డైరక్టర్ సముజ్వల తదితరులు పాల్గొన్నారు.



# ఎంటర్‌టైన్‌మెంట్ కోసం కాదు..

- విదేశీ సంస్థలకు నమ్మకం కలిగించేందుకే పర్యటన
- రాబోయే 20ఏళ్ల ప్రభుత్వ లక్ష్యం ఏంటో వారికి వివరించాం..
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- రూ.31వేల కోట్ల పెట్టుబడులు, 19 ఎంఓయూలు

**జనపదం, హైదరాబాద్:** రాబోయే 20ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం ఏంటో తెలిపేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బృందం అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలు చేసిందని, తాము ఎంటర్‌టైన్‌మెంట్ కోసం విదేశీ పర్యటనకు వెళ్లలేదని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా విదేశీ సంస్థలకు నమ్మకం కలిగించేందుకే పర్యటన చేసినట్లు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత దక్షిణ కొరియా దేశాన్ని సందర్శించడం మొదటి సారన్నారు. తెలంగాణ ఫ్యూచర్ ను దృష్టిలో పెట్టుకుని స్కిల్ యూనివర్సిటీ, మూసి అభివృద్ధి, ఫ్యూచర్ సిటీ పై పలువురు విదేశీ ప్రతినిధులతో చర్చలు జరిపామన్నారు. విదేశీ పర్యటనలో రూ.31 వేల కోట్ల పెట్టుబడులు, 19 ఎంఓయూలు చేసుకున్నామని, ఈ ఒప్పందాల వల్ల 30,750 ఉద్యోగాల కల్పన జరిగే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పెట్టుబడుల కోసం అమెరికాకు సీఎం వెళ్లడం ఇదే మొదటిసారని, కాగ్నిజెంట్, ఆర్ అండ్ డీ సంస్థల విస్తరణ ప్రత్యక్షంగా చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కార్నింగ్ లాంటి సంస్థలు తెలంగాణను విడిచి వెళ్తున్నాయనే దుష్ప్రచారం చేశారని, అయితే అదే సంస్థతో చర్చలు జరిపామని, వాళ్లు ఇక్కడే ఉండేందుకు సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారన్నారు. ఇక రెండు మూడు నెలల్లో తెలంగాణలో అమెజాన్ భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు. ఎన్ని పెట్టుబడులు వస్తున్నాయో ప్రజలు అంతా చూస్తున్నారని, ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలన్నదే మా ఆలోచన అన్నారు. రాష్ట్రంలో కంపెనీల స్థాపనకు ప్రభుత్వ పరంగా ఎక్కడ కూడా ఆటంకం కలుగ కుండా ముందుకు పోతున్నామని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి కోసం ఒప్పందాలు చేసుకుంటే కొంత మంది అసూయతో ఏదేదో మాట్లాడుతున్నారని, గతంలో కేసీఆర్ 15 రోజుల చైనా టూర్ వెళ్లి, వెయ్యి కోట్ల ఒప్పందం చేసుకున్నారని, అయితే గ్రౌండ్ లెవల్లో వంద, రెండు వందల కోట్లు దాటలేదని ఆరోపించారు.

# రేపు సీఎల్పీ మీటింగ్

- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం
- రాజ్యసభ, లోకల్ బాడీ ఎన్నికలపై చర్చ
- హాజరుకానున్న అభిషేక్ సింఘ్వీ

**జనపదం, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి అధ్యక్ష్యతన ఈ నెల 18వ తేదీ ఆదివారం సాయంత్రం 7గంటలకు నానక్ రామ్ గూడ ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ హోటల్ షెరటాన్ లో కాంగ్రెస్ శాసనసభాక్ష సమావేశం జరగనుంది. మీటింగ్ కు 74 మంది ఎమ్మెల్యేలు, 10మంది ఎంపీలు, 14మంది ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు. కాగా, తెలంగాణ కోటాలో రాజ్యసభ స్థానానికి సీనియర్ నేత కె.కేశవరావు రాజీనామా చేయడంతో వచ్చే నెల 3న ఉప ఎన్నిక జరగనుంచి ఈ ఎన్నికల్లో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ అభ్యర్థిత్వాన్ని ఇటీవల హైకమాండ్ దృవీకరించింది. ఈ క్రమంలో సీఎం అభిషేక్ సింఘ్వీ ని సభ్యులకు పరిచయం చేయనున్నారు. అలాగే ఈ నెల 20న కృతజ్ఞత సభ ఏర్పాటు చేయాలని పార్టీ భావిస్తోంది. అదే రోజు రాజీవ్ గాంధీ విగ్రహా విష్కరణ కు రాహుల్ గాంధీ, సోనియా గాంధీలను ఆహ్వానించనున్నారు. ఇందుకు సంబంధించి అంశాలపై కూడా రేవంత్ రెడ్డి చర్చించనున్నారు. ముఖ్యంగా త్వరలో జరిగే లోకల్ బాడీ ఎన్నికలు, రాజ్యసభ అభ్యర్థిపై పై సీఎల్పీలో కూడా చర్చజరిగే అవకాశం ఉంది.

# మహిళల వార్..

- తాజా.. వర్సెస్ మాజీ ..
- ముదురుతున్న మాటల యుద్ధం..
- కేటీఆర్ ఎపిసోడ్ పై వాగ్వాదం..
- కౌంటర్లు.. ఖండనలు..
- అటు సీతక్క, సురేఖ., ఇటు సబితా, సునితా..

**జనపదం, హైదరాబాద్ :** మహిళామణుల మధ్య మాటల యుద్ధమిది. అధికార., విపక్ష నాయకురాళ్ల నడుమ అప్రకటిత వార్. కేటీఆర్ మాట తూలాడని మొదలైన ఫైట్ ఇప్పుడు తారాస్థాయికి చేరింది. బీఆర్ఎస్ లో మంత్రులుగా చేసిన వారు, రేవంత్ సర్కార్ లో మంత్రులుగా చేస్తున్నవారు పోటాపోటీగా మాటలకు దిగుతున్నారు. క్షమాపన చెప్పాలనే కారణంతో మొదలైన జగడం ఇప్పుడు పర్సనల్ విషయాలపై సోషల్ మీడియాలో ఆకతాయిల నుంచి వేధింపులు ఎదుర్కొనే వరకు వెళ్లింది. కేటీఆర్ క్షమాపణ చెప్పినా, బహిరంగంగా ప్రకటించాలని మంత్రులు సురేఖ, సీతక్క డిమాండ్ చేస్తుండగా, మాకు అన్యాయం జరిగినప్పుడు నోరెందుకు మెదపలేదని మాజీ మంత్రులు సబితా, సునితా నిలదీస్తున్నారు. అసెంబ్లీ సాక్షిగా కన్నీరు కార్చిన కనికరించని ప్రభుత్వంలో ఉన్న సోదరీ మణులు ఎందుకు పట్టించుకోలేదని నిలదీస్తున్నారు.

**మంత్రి సీతక్క ఆవేదన..**

మహిళలంటే కొందరికి చిన్న చూపు ఉందని మంత్రి సీతక్క ఆవేదన వెలిబుచ్చారు. తాను పేదరికం నుంచి వచ్చి ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నా మింగుడు పడని వారున్నారు. కిందస్థాయి నుంచి ఎదిగినా తనలాంటి వారికే అవమానాలు, కించపర్చడాలు ఎదురైతే సామాన్య స్త్రీ మూర్తి పరిస్థితి ఏంటంటున్నారు. వెళ్లే దారిలో ముళ్లు, రాళ్లు దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితులుంటాయని తెలిసినా కొన్ని సందర్భాల్లో ఆలోచనలకు విఘాతం కలిగే ఘటనలు బాధిస్తాయన్నారు. మంత్రిగా చేస్తున్న తనలాంటి వారినే వేధిస్తున్న ఘటనలు దుర్మార్గమని, వేటిని పట్టించుకోకుండా ముందుకు వెళ్లడమే తన పని అని సీతక్క తెలిపారు. తనకు అవకాశం కల్పించని పెద్దలందరి అండదండలో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమసమాజ స్థాపన కోసం నిరంతరం ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటానన్నారు.

# దాడి వెనుకెవరు...?

- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుకే దిక్కులేదు..
- సామాన్యుడి పరిస్థితి ఏంటి..?
- సిద్దిపేట ఘటనపై బీఆర్ఎస్ ఫైర్..
- పట్టణంలో టెన్షన్ వాతావరణం...
- బీఆర్ఎస్ పై 23, కాంగ్రెస్ శ్రేణులపై 20 కేసులు నమోదు..



**జనపదం, సిద్దిపేట:** స్వయంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం. అదీ సర్కార్ ఆస్తి. అందునా ఓ ప్రతిపక్షంలో కీలకమైన ప్రజాప్రతినిధి. మరీ ముఖ్యంగా బాధ్యతాయుతమైన మంత్రి పదవులు నిర్వర్తించిన నాయకుడు. అలాంటి ఎమ్మెల్యే కార్యాలయంపై అర్ధరాత్రి దాడి ఎవరి పని అనేది ఇప్పుడు రాష్ట్రమంతా చర్చనీయాంశం. కాంగ్రెస్ శ్రేణులదే ఆ కుట్ర అని బహిరంగంగానే తెలుస్తున్నా దాని వెనక దాగున్నది ఎవరూ అనేది తేలాల్సి ఉంది. అల్లరి మూకలు క్యాంపు ఆఫీస్ పై దాడికి దిగడం ముమ్మాటికి ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనే అని అభిప్రాయపడుతున్నారు.

**ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుకే దిక్కులేదు..**

సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ పై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్రపోషించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్షానికి ఓ రూల్, ప్రభుత్వానికి మరో రూల్ మాదిరిగా రక్షక భటులు మెదలడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్వయంగా పోలీసుల సాక్షిగానే దాడి జరిగిందని, అయినా వాళ్లు మౌనం వహించడం వెనక అర్థమేంటని మాజీ మంత్రి హరీష్ రావు బహిరంగంగానే ప్రశ్నించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ నిధులతో నిర్మాణం జరుపుకున్న ఓ కార్యాలయానికే దిక్కులేకపోతే ఇక సామాన్య మానవుడి రక్షణకు ఎవరు దిక్కని నిలదీశారు. అర్ధరాత్రి రౌడీ మూకలు, చిల్లరగాళ్లు కాంగ్రెస్ పార్టీ నేతల అండదండలో చెలరేగిపోయి ఆఫీస్ లోని ఫ్లెక్సీలను చింపడం, దౌర్జన్యానికి దిగి ధ్వంసం చేయడం ఏ సంకేతాలు ఇస్తుందని అడుగుతున్నారు.

**సిద్దిపేట ఘటనపై బీఆర్ఎస్ ఫైర్..**

శుక్రవారం అర్ధరాత్రి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పై దాడి, ఫ్లెక్సీల ధ్వంసం, ఘటనపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏనాడు ఎమ్మెల్యే కార్యాలయాలపై దాడి చేసిన ఘటనలు చోటు చేసుకోలేదని, 9 నెలల కాంగ్రెస్ పాలనతో ఇలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక ఘటనలు జరగడం బాధాకరం అని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని, చర్యకు ప్రతిచర్య ఉన్నట్టే కాంగ్రెస్ పనికి సరైన సమాధానం చెబుతామని మరికొందరు హెచ్చరించారు. ఇరు పార్టీలు పోటాపోటీగా నిరసనలు, కార్యక్రమాలు చేపట్టడంతో సిద్దిపేటలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఆయా ఘటనలు, దాడులు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాలు వంటి పలు ఉపద్రవాల్లో బీఆర్ఎస్ పార్టీ నేతలపై 23 కేసులు, కాంగ్రెస్ శ్రేణులపై 20 కేసులు నమోదయ్యాయి. పట్టణంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు బందోబస్తును పెంచారు.

**కారకులెవరు..?**

హరీష్ రావు రాజీనామా చేయాలనే డిమాండ్ తో సిద్దిపేటలో రాజకీయ వేడి రాజుకుంది. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. కాగా, కాంగ్రెస్ చేసిన ఘాతుకుం వెనక ఎవరి హస్తం ఉందో తెలపాలని ఎమ్మెల్యే హరీశ్ రావు సహా బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తెరవెనక ఉండి ఉసిగొల్పుతున్న నాయకులను గుర్తించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# విద్యార్థులకు గుడ్ న్యూస్..

## దసరా నుంచి స్కిల్ యూనివర్సిటీలో కోర్సుల ప్రారంభం

- నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు తాత్కాలిక భవనంలో నిర్వహణ
- 140 కంపెనీలు భాగస్వామ్యం అయ్యేందుకు ఆసక్తి
- వెల్లడించిన సీఎస్ శాంతి కుమారి



**జనపదం, హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలమేరకు రూపు దిద్దుకున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా పలు రంగాల్లో కోర్సులను దసరా పండగ నుండి ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా దాదాపు 20 కోర్సులను నిర్వహించాలని గుర్తించడం జరిగిందని, వీటిలో దసరా నుంచి ప్రాథమికంగా ఆరు కోర్సులను ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ స్కిల్ యూనివర్సిటీ ప్రారంభం, విధి విధానాల ఖరారు, కోర్సుల ప్రారంభం తదితర అంశాలపై శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, పరిశ్రమల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామ కృష్ణారావు, జయేష్ రంజన్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ విష్ణు వర్ధన్ రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకట రమణ, శ్రీనిరాజు, వీవీఎల్ఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ ముచ్చర్ల వద్ద కేటాయించిన 57 ఎకరాల స్థలంలో ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకు స్థాపన చేశారని, పనులు ముగిసే వరకు తాత్కాలిక భవనంలో ఈ యూనివర్సిటీ ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకు గాను, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా గానీ, నాక్ లేదా నిథమ్ లో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఈ యూనివర్సిటీ చైర్ పర్సన్ గా ఆనంద్ మహేంద్రను, శ్రీనివాస సీ రాజు ను కో చైర్మన్ గా నియమించినట్లు గుర్తు చేశారు. ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో దాదాపు 140 కంపెనీలు భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్నాయని, దాదాపు 20 కోర్సులను ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించగా, తొలుత స్కూల్ ఆఫ్ ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రిటైల్ విభాగంలోనూ సర్టిఫికెట్ కోర్స్ లు, డిప్లొమా కోర్సులను ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో శిక్షణ నిమిత్తం దేశంలోని ప్రముఖ కార్పొరేట్ సంస్థలైన ఎస్ బీఐ, ఎన్ ఏసీ, డాక్టర్ రెడ్డి, టీబీఏజీఏ, ఆదానీలు భాగస్వాములుగా ఉండేందుకు అంగీకరించారని వీరితోపాటు సీఐఐ కూడా ముందుకు వచ్చిందని వెల్లడించారు. ఈ యూనివర్సిటీ కి సంబంధించిన లోగో ను, వెబ్ సైట్ ను ను ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ యూనివర్సిటీ లో కోర్సు పూర్తి చేసిన వారికి ఆకర్షణీయమైన వేతనంతో కూడిన ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు.



# రన్నింగ్ ఊడిన బస్సు టైర్లు..

- పల్లెవెలుగులో 150 మంది ప్రయాణికులు
- డ్రైవర్ అప్రమత్తతో తప్పిన ప్రాణనష్టం
- జగిత్యాల జిల్లాలో ఘటన

**జనపదం, జగిత్యాల :** రన్నింగ్ లో ఆర్టీసీ బస్సు వెనకాల ఉనన రెండు టైర్లు ఊడిపోయాయి. అయితే డ్రైవర్ అప్రమత్తతో భారీ ప్రమాదం తప్పినట్లయ్యింది. ఘటన జరిగిన సమయంలో 150 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల నుంచి నిర్మల్‌కు పల్లె బస్సు వెళ్తున్నది. ఈ క్రమంలో బస్సు జగిత్యాల శివారు మొరపల్లి గ్రామం వద్దకు చేరుకోగానే వెనుకాల రెండు చక్రాలు ఊడిపోయి పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సుని నిలుపడంతో భారీ ప్రమాదం తప్పింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం కాకుండా బయటపడ్డారు. వరుసగా సెలవులు రావడంతో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కళకళలాడుతున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో దాదాపు 150 మంది వరకు ఉన్నట్లు తెలుస్తున్నది.

# పకడ్బందీ ఏర్పాట్లు..

- గణేష్ ఉత్సవాలపై మంత్రి పొన్నం రివ్యూ
- అధికారులకు సలహాలు. సూచనలు..



**జనపదం,హైదరాబాద్ :** తెలంగాణలో గణేష్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ రివ్యూ చేశారు. అన్ని శాఖల అధికారులతో మీటింగ్ నిర్వహించి పలు విషయాలపై చర్చించారు. విగ్రహాల ప్రతిష్టా నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. మండపాలు ఏర్పాటు చేసుకునే వారంతా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

# బోర్డు తిప్పేసిన మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ

**జనపదం, హైదరాబాద్ :** హైదరాబాద్ లో మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ 100 ఫీట్ రోడ్డులో 'ఫ్రైడే అప్ కన్సల్టెన్సీ' కంపెనీ ఏర్పాటు చేసింది. దాదాపు 200 నిరుద్యోగుల నుంచి రూ.1,50,000 వసూలు చేసింది. ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం ఇస్తామని కంపెనీ ప్రతినిధులు నమ్మించారు. కార్యాలయానికి తాళం వేయడంతో గ్రహించిన బాధితులు మోసపోయామని లబోదిబో మంటున్నారు. ఈ ఘటనపై మాదాపూర్ పీస్ లో ఫిర్యాదు చేశారు. అలాగే ఈ సంస్థకు విజయవాడ, బెంగుళూరులో బ్రాంచీలు ఉన్నట్లు సమాచారం.

# తెలంగాణ బీజేపీ వ్యవహారాల ఇంఛార్జిగా అభయ్ పాటిల్



**జనపదం, న్యూ ఢిల్లీ :** తెలంగాణ బీజేపీ వ్యవహారాల ఇంఛార్జిగా కర్ణాటక నేత అభయ్ పాటిల్‌ను ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఇంతకు మందు.. లోక్‌సభ ఎన్నికల టైంలోనూ తెలంగాణ బీజేపీ ఇంఛార్జిగా ఆయన వ్యవహరించారు. ఈయనది కర్ణాటక. పూర్తి పేరు అభయ్‌కుమార్ పాటిల్. దక్షిణ బెల్గాం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కార్యకర్తగా బీజేపీలో తన ప్రస్థానం ప్రారంభించిన అభయ్‌కు సోషల్ మీడియా ద్వారా యూత్‌తో మంచి ఫాలోయింగ్ ఉంది. ఒకవైపు సామాజిక కార్యక్రమాలతో పాటు మరో వైపు.. నియోజకవర్గానికి ఐటీ పార్క్ ఏర్పాటు లాంటి పలు అభివృద్ధి కార్యక్రమాలతో ఆయన ప్రజల దృష్టిని ఆకర్షించగలిగారు. బెలగావి అభివృద్ధి కోసం విజన్ 2040 పేరిట ఆయన ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం కూడా లభించింది.





# కన్నీరు పెట్టుకున్న వినేశ్ ఫొగాట్..

- భారత గడ్డపై అడుగు పెట్టిన వినేష్ ఫొగాట్
- ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు తరలివచ్చిన ఫ్యాన్స్
- వారిని చూసిన కన్నీళ్లు పెట్టుకున్న రెజ్లర్

**జనపదం, ఢిల్లీ:** పారిస్ 2024 ఒలింపిక్స్‌లో 100 గ్రాముల అదనపు బరువు కారణంగా పతకానికి దూరమైన భారత మహిళా రెజ్లర్ వినేష్ ఫొగాట్ స్వదేశానికి చేరుకుంది. పారిస్ ఒలింపిక్స్ ముగిసిన సుమారు ఐదు రోజుల తర్వాత ఆమె భారత గడ్డపై అడుగు పెట్టింది. శనివారం ఢిల్లీ విమానాశ్రయంలో అడుగుపెట్టిన ఆమెకు.. పెద్ద ఎత్తున అభిమానులు స్వాగతం పలికారు. అయితే వారిని చూసిన వినేష్ ఫొగాట్.. భావోద్వేగానికి గురైంది. ఒక్కసారిగా కన్నీళ్లు పెట్టుకుంది. ఈ సమయంలో ఆమె కాంగ్రెస్ ఎంపీ దీపిందర్ హుడా, భారత రెజ్లర్లు సాక్షి మాలిక్, బజరంగ్ పూనియా తదితరులు ఓదార్చారు. వినేష్ ఫొగాట్ ఢిల్లీ వచ్చిన సందర్భంగా రెజ్లర్లు బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్ మాట్లాడారు. దేశం కోసం ఆమె ఏం చేసిందో ప్రతీ ఒక్కరికి తెలుసని వ్యాఖ్యానించారు. దేశంలోని ప్రతి ఒక్కరూ ఆమె పోరాటాన్ని గుర్తించారని.. దానికి ఉదాహరణే ఈ స్వాగతం అని చెప్పుకొచ్చారు. వినేష్ ఫొగాట్.. ప్రశంసలు, గౌరవానికి అర్హురాలని రెజ్లర్లు అన్నారు. ఆమెను విజేతగా భావించే.. స్వాగతం పలికామని.. తమ దృష్టిలో వినేష్ ఫొగాట్ స్వర్ణ పతకం సాధించినట్లే అని స్వాగతం పలికేందుకు వచ్చిన వారు పేర్కొన్నారు.

# డైమండ్ లీగ్ బరి నీరజ్ చోప్రా..

### మళ్లీ సర్జరీ వాయిదా..

**జనపదం, స్పోర్ట్స్:** ఒలింపిక్స్‌లో వరుసగా రెండోసారి పతకం అందుకున్న నీరజ్ చోప్రా మళ్లీ పతకం వేటలో పడ్డాడు. తాజాగా ఆయన మరో టోర్నీకి సిద్ధమవుతున్నాడు. పారిస్ జావెలిన్ త్రో పోటీల్లో రజతం కొల్లగొట్టిన నీరజ్ సర్జరీ వార్తలను తోసిపుచ్చాడు. త్వరలో జరుగబోయే లసాన్నే డైమండ్ లీగ్‌లో ఆడడంపై నెలకొన్న ఉత్కంఠకు తెర దించాడు. ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లో శిక్షణ పొందుతున్న అతడు ఈ టోర్నీలో పాల్గొంటున్నట్టు వెల్లడించాడు. 'లసాన్నే డైమండ్ లీగ్ బరిలో నిలవాలని నిర్ణయం తీసుకున్నా. ఆగస్టు 22 నుంచి టోర్నీ ఆరంభం కానుంది. అదృష్టవశాత్తూ పారిస్ ఒలింపిక్స్ సాఫీగా సాగాయి. ఇక నా గాయంతో ఇప్పుడు పెద్దగా ఇబ్బందేమీ లేదు. అందుకని ఈ సీజన్‌లో డైమండ్ లీగ్‌లో పోటీ పడాలని అనుకున్నా. అనంతరం గాయానికి ట్రీట్మెంట్‌పై వైద్యుల సలహా తీసుకుంటా. సెప్టెంబర్ ముగిశాక భారత్ వస్తాను. అప్పుడే గజ్జల్లో గాయం గురించి డాక్టర్‌ను సంప్రదిస్తాను' అని నీరజ్ చోప్రా తెలిపాడు.






# అమ్మకానికి పంజాబ్ కింగ్స్..!

### కోర్టును ఆశ్రయించిన ప్రీతిజింతా..

**జనపదం, స్పోర్ట్స్:** కేపీహెచ్ డ్రీమ్ క్రికెట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ పంజాబ్ కింగ్స్‌ను ప్రమోట్ చేస్తుంది. ఈ కంపెనీలో ప్రీతి జింతాతో కలిపి నలుగురికి వాటాలు ఉన్నాయి. ఇందులో ప్రీతికి 25 శాతం షేర్లు ఉండగా.. మోహిత్ బర్మన్ అనే ప్రమోటర్‌కు అత్యధికంగా 48 శాతం షేర్లు ఉన్నాయి. బర్మన్ ఈ మధ్య తన వాటాను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడు. దీంతో, అతడిని అడ్డుకోవాలని ప్రీతి ఛండీగఢ్ హైకోర్టులో అప్పీల్ చేసింది. అయితే.. అంతర్జాతీయ ఒప్పందాల్లోని ఆర్టికల్ 19 ప్రకారం ఒక గ్రూప్‌లోని వ్యక్తి తన షేర్లను అమ్మడానికి ముందు సదరు గ్రూప్ సభ్యులకు తెలియజేయాలి. ఒకవేళ గ్రూప్‌లోని వాళ్లు తమ వల్ల కాదని చేతులెత్తేస్తే.. అప్పుడు ఇతరులకు అమ్ముకునే వెసులుబాటు ఉంది. అంతేకాదు వాటాల విక్రయానికి నిర్ణీత కాల పరిమితి ఉంటుంది. ఇదే విషయాన్ని ప్రీతి కోర్టు ఫిర్యాదులో పేర్కొంది. అయితే.. బర్మన్ మాట్లాడుతూ.. తానేమీ వాటాల అమ్మకానికి సిద్ధపడడం లేదని తెలిపాడు. కేపీహెచ్ డ్రీమ్ క్రికెట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ప్రీతి (27శాతం), బర్మన్(48 శాతం), నెస్ వాడియా(23 శాతం) అత్యధిక షేర్లు కలిగి ఉన్నారు. మిగిలిన ఆరు శాతం షేర్లు కరన్ పాల్ అనే వ్యక్తి పేరిట ఉన్నాయి.

# అన్ క్యాప్ డ్ ప్లేయర్ గా ధోని..!




### మహీ కోసం మళ్లీ ఆ రూల్..?

**జనపదం, స్పోర్ట్స్:** ఐపీఎల్ 2025 సీజన్‌లో ధోనీ ఆడతాడా? లేదా? అనే విషయంపై తీవ్ర సందిగ్ధత నెలకొంది. అలాగే వచ్చే సీజన్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ ఉండే అవకాశం లేదని కూడా అంటున్నారు. అయితే గత ఎడిషన్‌లో కెప్టెన్సీ వదిలేసిన మహీ లోయర్ ఆర్డర్ కన్నా దిగువన బ్యాటింగ్‌కు వచ్చి ఆఖరి ఓవర్లలో పరుగులు సాధించాడు. దీంతో వచ్చే సీజన్‌లో అతడు ఇంపాక్ట్‌గా బరిలోకి దిగొచ్చని అంతా భావించారు. మరి ఇప్పుడా రూల్‌నే పక్కన పెట్టేస్తారని ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో మహీని అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా తీసుకునేందుకు చెన్నై ఫ్రాంఛైజీ మొగ్గు చూపిస్తోందని తెలుస్తోంది.

### అన్ క్యాప్ డ్ ప్లేయర్..


సాధారణంగా అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌అంటే నేషనల్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహించని క్రికెటర్ అని అర్థం. అంటే దేశవాళీలో ఆడుతూ ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి ఇంకా అడుగుపెట్టని ఆటగాళ్లను అలా పిలుస్తుంటారు. అలానే ఇంటర్నేషనల్ కెరీర్‌కు రిటైర్మెంట్ చెప్పి ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఆటగాళ్లను ఇలానే పిలుస్తుంటారు. కానీ, ఈ నిబంధన ఇప్పుడు ఉపయోగంలో లేదు. అయితే ఇప్పుడు మహీ విషయంలో దీనినే అమలులోకి తీసుకురావాలని చెన్నై సూపర్ కింగ్స్ బీసీసీఐని కోరుతోంది. గత నెలాఖరున బీసీసీఐతో జరిగిన సమావేశంలో బీసీసీఐ దృష్టికి ఈ రిటెన్షన్ రూల్‌ను చెన్నై కింగ్స్ తీసుకెళ్లగా బోర్డు కూడా పాజిటివ్‌గానే రియాక్ట్ అయినట్లు సమాచారం. ఐపీఎల్ పాత నిబంధన ప్రకారం ధోనీని 2026 వరకూ అట్టిపెట్టుకునే వీలుంది.

### మహీ కోసం.. మళ్లీ రూల్..

ఒకవేళ ఈ రూల్ అందుబాటులోకి వస్తే నిధుల పరంగా సీఎస్కేకు మంచి ప్రయోజనం ఉంటుంది. ప్రస్తుతం మహీ రూ.12 కోట్లు వరకు అందుకుంటున్నాడు. ఒకవేళ అన్ క్యాప్‌డ్ ప్లేయర్‌గా ఆడితే అతడికి రూ.4 కోట్లకు మించి ఇవ్వనక్కర్లేదు. దీంతో మిగిలిన అమౌంట్‌ను పెద్ద ప్లేయర్లను కొనుగోలు చేసేందుకు వాడుకోవచ్చు. దీనిపై మమహేంద్ర సింగ్ ధోని స్పందిస్తూ.. సీజన్‌కు ఇంకా చాలా సమయం మిగిలి ఉందని, ప్లేయర్ రిటెన్షన్ నిబంధనపై ఎలాంటి నిర్ణయాన్ని తీసుకుంటారో చూద్దామన్నారు. ఇప్పుడు బాల్ మన కోర్టులో లేదని, ఒక్కసారి నియమ నిబంధనలు కన్ఫామ్ అయితే ఆలోచించి డెసిషన్ తీసుకుంటానని పేర్కొన్నారు.





## CINEMA NEWS సినిమా పదం




**పాన్ ఇండియా స్టార్ ప్రభాస్** తాజాగా మరో సినిమాను ప్రారంభించాడు. పడి పడి లేచే మనసు, సీతారామం, అందాల రాక్షసి చిత్రాల ఫేమ్ హను రాఘవపూడి కాంబోలో ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. 'ఫౌజీ' అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమా శనివారం పూజా కార్యక్రమాలతో లాంచ్ అయ్యింది. ఈ విషయాన్ని మైత్రీ మూవీ మేకర్స్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఈ వేడుకకు ప్రభాస్‌తో పాటు హను రాఘవపూడి వచ్చి సందడి చేశారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఇమాన్ ఎస్మాయిల్ నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఫౌజీ అంటే సైనికుడు అని అర్థం. ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారట. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే కథతో రానుండగా బ్రిటీష్‌వారి సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించనున్నారట.

# జటాధర..

సుధీర్ బాబు నటించిన రీసెంట్ మూవీ 'హరోం హర' బాక్సాఫీస్ దగ్గర మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాను పూర్తి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా చిత్ర యూనిట్ తెరకెక్కించగా, సుధీర్ బాబు పర్ఫార్మెన్స్‌కి ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ దక్కింది. ఇక ఇప్పుడు సుధీర్ బాబు తన కొత్త సినిమాపై అప్డేట్ ఇచ్చాడు. 'జటాధర' అనే మరో పవర్‌ఫుల్ టైటిల్‌తో తన నెక్ట్స్ మూవీకి సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రివీల్ చేశారు. ఈ పోస్టర్ చూస్తుంటే, ఇందులో కూడా సుధీర్ బాబు ఓ పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ సినిమాను వెంకట్ కళ్యాణ్ డైరెక్ట్ చేస్తుండగా ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ ద్విభాషా చిత్రంగా మేకర్స్ తెరకెక్కించనున్నారు. ఈ సినిమా షూటింగ్‌ను అతి త్వరలో ప్రారంభించబోతున్నట్లు వారు ప్రకటించారు.



# హ్యాపీ బర్త్ డే నిధి..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా చేస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు జ్యోతి కృష్ణ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం "హరిహర వీరమల్లు". పవన్ నుంచి అనౌన్స్ అయ్యిన మొదటి పాన్ ఇండియా సినిమా ఇది. ఈ చిత్రంపై భారీ హైప్ అప్పట్లో నెలకొంది. ఇక ఈ చిత్రంలో పవన్ సరసన యంగ్ అండ్ గ్లామరస్ బ్యూటీ నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. మరి శనివారం నిధి బర్త్ డే కానుకగా మేకర్స్ ఒక అద్భుతమైన పోస్టర్ ని లాంచ్ చేసారు. ఇందులో నిధి అగర్వాల్ స్టన్నింగ్ లుక్స్ లో అదరగొట్టింది అని చెప్పాలి. తన డ్రెస్సింగ్ గాని ధరించిన ఆభరణాలు కానీ ఆమెకి మరింత అందాన్ని తీసుకొచ్చాయి.



# ఇంద్ర అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్


**మెగాస్టార్ చిరంజీవి** నటించిన ఆల్ టైం బ్లాక్ బస్టర్ ఇంద్ర సినిమాను రీ రిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించి అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. గత కొన్ని రోజులుగా ఈ సినిమా వాయిదా పడనునట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. మూవీ రీ రిలీజ్‌కు వారం ముందు (మిస్టర్ బచ్చన్, తంగలాన్, డబుల్ ఇస్మార్ట్) పెద్ద సినిమాలు రిలీజ్ అయ్యాయి. దీంతో ఈ సినిమా విడుదలైన వారం రోజులకే రీ రిలీజ్ ఉండడంతో ఇంద్ర ఎఫెక్ట్ ఈ సినిమాలపై ఉంటుందని ముఖ్యంగా కలెక్షన్లపై ప్రభావం పడే అవకాశం ఉందని మేకర్స్ ఆలోచించినట్లు తెలిసింది. అయితే తెలుగులో విడుదలైన మిస్టర్ బచ్చన్, డబుల్ ఇస్మార్ట్ చిత్రాలు మిక్స్‌డ్ టాక్ తెచ్చుకోవడంతో ఇంద్ర మూవీ రీ రిలీజ్‌కు లైన్ క్లియర్ అయినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే తాజాగా అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.




# అమెజాన్ ప్రైమ్‌లో తెలుగు వెర్షన్..

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'కల్కి 2898 ఏడీ'. ఈ మూవీ ఓటీ టీ లోకి వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా సినీ ప్రియులకు ప్రభాస్ టీమ్ శుభవార్త చెప్పింది. ఈ చిత్రాన్ని రెండు ఓటీటీ సంస్థల వేదికగా విడుదల చేయనున్నట్లు తెలిపింది. హిందీ వర్షెన్ ఆగస్టు 22న నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు వెల్లడించింది. ఇక అదే రోజు తెలుగు, తమిళం, మలయాళం సహా ఇతర భాషల్లో ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వేదికగా అందుబాటులోకి రానుంది. ఈ మేరకు రెండు సంస్థలు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించాయి.





- సంక్షోభంలో కర్ణాటక సర్కారు
- సీఎం సిద్ధరామయ్యపై కేసు
- విచారణకు గవర్నర్ ఆదేశం
- హుటాహుటిన కేబినేట్ భేటీ
- కొత్త సీఎం గా డికె శివకుమార్
- రంగంలోకి కేసీ వేణుగోపాల్

# సిద్ధా మెడకు ముదా...

జనపదం, బెంగుళూరు: కర్ణాటక ప్రభుత్వం సంక్షోభంలో కొట్టుమిట్టాడబోతున్నది. సీఎం సిద్ధరామయ్య మెడకు విచారణ ఉచ్చుబిగుస్తున్నది. అవినీతి ఆరోపణల్లో ఏకంగా గవర్నర్ విచారణకు ఆదేశించడంతో గత్యంతరం లేక అత్యవసర కేబినేట్ భేటీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వంలో సీఎం మార్పుంటుందని ప్రచారం ఊపందకుంటుంది. ఈ మేరకు కాంగ్రెస్ కీలక నేత కేసీ వేణుగోపాల్ కూడా రంగంలోకి దిగి పరిస్థితిపై ఆరా తీస్తున్నారు.

**ముదాలో ఇరుక్కుని..**

మైసూరు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (ముదా) లేఅవుట్ స్కామ్‌లో కర్నాటక సీఎం సిద్ధరామయ్య ను విచారించనున్నారు. అవినీతి కేసులో సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ థావర్‌చాంద్ గెహ్లాట్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ప్రత్యేక క్యాబినెట్ భేటీ ఏర్పాటు చేశారు. ముదా లేఅవుట్‌లో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి ఖరీదైన ప్లాట్లను ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముదా లేఅవుట్‌లో ఎలా ఆమె ఓనర్ అయ్యారని ప్రశ్నలు ఉత్పన్నం అయ్యాయి. విచారణ కోసం గవర్నర్ గెహ్లాట్ క్లియరెన్స్ ఇవ్వడంతో సిద్ధరామయ్యపై కేసు బుక్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. సామాజిక కార్యకర్తలు ప్రదీప్ కుమార్, టీజే అబ్రహం, స్నేహమయి కృష్ణ అభ్యర్థనల మేరకు విచారణ కోసం ఆదేశాలు ఇచ్చారు. భారతీయ నాగరికా సురక్షా సంహితలోని సెక్షన్ 17, సెక్షన్ 218 కింద విచారణకు గవర్నర్ అనుమతి ఇచ్చారు.

# సారీ చెప్పిండు గదా... ఇంకేంది..?

- మా కేటీఆర్ ను మహిళా లోకం స్వాగతిస్తోంది
- ముందు మర్డర్లు, మానభంగాల పై మాట్లాడండి..
- బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు

**జనపదం, హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ రామారావు తన ప్రసంగం లో పొరపాటు దొర్లితే హుందా గా క్షమాపణ చెప్పినా కాంగ్రెస్ మంత్రులు, నాయకురాళ్లకు ఓపిక లేదని బీఆర్ఎస్ మాజీ మంత్రులు, మహిళా నేతలు మండిపడ్డారు. శనివారం మాజీ మంత్రులు సబితా ఇంద్రా రెడ్డి, సునీతా లక్ష్మా రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, సుశీలా రెడ్డి తెలంగాణ భవన్ మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ తీరును మహిళా లోకం స్వాగతిస్తోందని చెప్పారు. ఆయన క్షమాపణ చెప్పినా కొందరు కాంగ్రెస్ మహిళా నేతలు ఇంకా ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. ఇద్దరు మహిళా మంత్రులు కూడా కేటీఆర్ పై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎనిమిది నెలలుగా రాష్ట్రం లో మహిళల పై 1800 అత్యాచారాలు జరిగితే, రేప్ లు మర్డర్లు నిత్యకృత్యంగా మారితే స్పందించని మహిళా కమిషన్ కేటీఆర్ పొరపాటున మాట్లాడిన మాటలపై అంత వేగంగా స్పందిస్తుందా అని ప్రశ్నించారు. కేటీఆర్ వ్యాఖ్యల పై మహిళ కమిషన్ చూపిన ఉత్సాహం బాధిత మహిళలను పరామర్శించడంలో చూపలేకపోయిందన్నారు. మహిళా మంత్రులు రాజకీయం కోసం మాట్లాడుతున్నారే తప్ప నిజంగా కేటీఆర్ కు కేసీఆర్ సంస్కారం నేర్పారు కాబట్టే ఆయన క్షమాపణ చెప్పారన్నారు. మరి సీఎం రేవంత్ కు ఎవరు సంస్కారం నేర్పినట్టు లేదు కాబట్టే నాలుగున్నర గంటలు మేము అసెంబ్లీలో నిలబడితే సీఎం క్షమాపణ చెప్పలేదన్నారు. కనీసం మైక్ ఇవ్వలేదని గుర్తు చేశారు.


# జనపదం
J A N A P A D H A M

2 PM పగటి వార్తలు

హైదరాబాద్ | శనివారం 17 ఆగస్టు 2024

తెలుగు దినపత్రిక


## పిరికిపందల చర్య

- రేవంత్ కాదు...
- రాహుల్ తల దించుకోవాలి
- మాజీ మంత్రి కేటీఆర్



జనపదం, సిద్ధిపేట: మాజీ మంత్రి హరీష్ రావు నివాసంపై కాంగ్రెస్ గుండాల దాడిని పిరికిపందల చర్యగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభివర్ణించారు. కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండించారు. పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం పగ సాధింపు రాజకీయాలకు, రాజకీయ హింసకు దూరంగా ఉన్నదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసుల సహాయంతో హింసను ప్రేరేపించేలా ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ థర్డ్ రేటెడ్ నీచ రాజకీయాలను గమనిస్తున్నారు, సరైన సమయంలో కాంగ్రెస్ కి బుద్ధి చెప్తారు. ఒకవైపు రాహుల్ గాంధీ 'మొహబ్బత్ కా దుకాణ్' అని మాట్లాడుతుంటే ఆయన పార్టీ తెలంగాణలో 'నఫ్రత్ కా దుకాణ్' అంటూ హింసను ప్రేరేపిస్తున్నది. ఇదేనా రాహుల్ గాంధీ వల్లె వేస్తున్న మొహబ్బత్ కా దుకాణ్ అని కేటీఆర్ ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షకుడిని అని ప్రకటించుకున్న రాహుల్ గాంధీ చేస్తున్న రాజ్యాంగ విలువల పరిరక్షణ ఇదేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ దుర్మార్గ కార్యక్రమాలకు రాహుల్ గాంధీ సిగ్గుతో తలదించుకోవాలన్నారు.



# కోతల మాఫీ..

**మాటల్లోనే గొప్ప., లెక్కల్లో బొక్కా..** | **రూ.41 వేల కోట్లకు 17 వేల కోట్లతో చెల్లుచిటీ..** | **అడిగితే దాడులు.. అన్నదాత పక్షన నిలిస్తే కేసులు..** | **మాజీ మంత్రి హరీష్ రావు**

**జనపదం, హైదరాబాద్:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరు దొంగతనం చేసిన దొంగే దొంగా.. దొంగా.. అన్నట్టుగా ఉందని, రుణమాఫీ ఎగనామం పెట్టి ఫోజులు కొడుతూ, అడిగిన వారిపై దాడులకు ఉసిగొల్పె డి దిగజారుడు స్థాయికి చేరిందని మాజీ మంత్రి హరీశ్ రావు దుయ్యబట్టారు. శనివారం మధ్యా హ్నం తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో ముచ్చటించారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ పై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిపై తీవ్ర నిరసన తెలిపారు. ఇప్పటికైనా తప్పు అ యిందని సీఎం క్షమాపణ కోరాలని, పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**నోరు పెద్దగా చేస్తే లాభం లేదు..**

సీఎం తప్పును కప్పిపుచ్చుకోవడానికి నోరు పెద్దగా చేస్తే లాభం లేదన్నారు. కాంగ్రెస్ రుణమాఫీ కథ ఎన్కటికి పంచపాండవులు అంటే మంచం కోళ్లవలె, ముచ్చటగా ముగ్గురు అని చెప్పి రెండు వేళ్లు చూపించినట్టుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో డిసెంబర్ 9 సోనియా పుట్టిన రోజు కానుకగా 40వేల కోట్ల రూపాయల మాఫీ ఏకకాలంలో చేస్తానని ఇదే నోటితో చెప్పి మాటతప్పిండన్నారు. ఆ తర్వాత దేవుళ్లపై ఒట్లేసి ఒట్లు వేయించుకుని గద్దెనెక్కి గద్దిరిస్తున్నాడన్నారు. వాస్తవాలు మాట్లాడితే జీర్ణించుకోలేక ముఖం చాటేసి పారిపోయాడన్నారు.

**నోరా మోరా..?**

రేవంత్ ది నోరా.. మోరా.. అర్థం కావడం లేదని, చెప్పేటోడికి చెవుడైనా వినేటోనికి వివేకం ఉంటది కదా అని హరీశ్ అన్నారు. రైతుల సంఖ్య తగ్గడమేమిటి., రుణగ్రహీతలు మరీ తగ్గడమేమిటీ.? డబ్బులు మాత్రం 17 వేల కోట్లతో సరిపోవడమేమిటో ఆయన చెప్పిన లెక్కల్లోనే తెలుస్తోందన్నారు. ఇదంతా ఎవరిని మభ్యపెట్టడానికి చేస్తున్నాడో చెప్పాలన్నారు. మళ్లీ ఇప్పుడు కూడా తాను రేవంత్ కు రుణమాఫీ అందరికి అయ్యిందని నిరూపించాలని సవాల్ విసురుతున్నట్టు చెప్పారు.

**ప్లేస్, టైం ఫిక్స్ చెయ్..**

రుణమాఫీ సక్రమమే , లెక్కలు చూసుకుందాం రా.. అని రేవంత్ రెడ్డే ప్లేసు, డేటు, టైం చెప్పితే అక్కడకు తాను వెల్లడానికి సిద్ధమని హరీష్ పేర్కొన్నారు. ఎవరు మాట్లాడుతున్నది నిజమో ఖుల్లం ఖుల్లంగా తేల్చుకుందాం అన్నారు.తాను మాట తప్పేటోడిని కాదని, చర్చకు వస్తావా... రేవంత్ అని ప్రశ్నించారు. కొడంగల్ లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి పార్టీలు మారి ముఖ్యమంత్రి అయిన చరిత్ర నీదన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి వచ్చి ఎన్నోసార్లు రాజీనామా చేసిన చరిత్ర తనదన్నారు. చంద్రబాబు సంకల జొచ్చి రైఫిల్ పట్టుకున్ననాడు తాను ప్రజల కోసం ఫైట్ చేశానన్నారు. ఎప్పటికీ మభ్యపెట్టి మతలబు చేసి అందరిని నమ్మించలేవని, రైతన్నను దగా చేసిన నీ తీరును యావత్ ప్రజానీకం గమనిస్తుందన్నారు. రైతు బంధు పైసలు ఎగ్గొట్టి, ఆ పైసలు ఇటు డైవర్ట్ చేసి తూతూ మంత్రంగా రుణమాఫీ చేసి డప్పు కొట్టుకుంటున్నవ్, డబ్బా వాయిస్తున్నవ్ అంతా చూస్తున్నారనే విషయం మర్చిపోకన్నారు. తాము ఆగస్టు 6న తెలంగాణ భవన్ లో రుణమాఫీ కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తే గడిచిన 10, 11 రోజుల్లో లక్ష 16 వేల ఫిర్యాదులు వచ్చాయని, రుణమాఫీ కాలేదు న్యాయం చేయండని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. ఒకవైపు రైతు బంధు రాక, మరోవైపు రుణమాఫీ చెయ్యక రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం కళ్లు, చెవులు, నోరు లేనట్లు వ్యవహరిస్తోందని, దమ్మంటే రుణమాఫీపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు.

**అంతా ఫ్లాప్..**

పరిపాలనలో ఫ్లాపని, తొండి చేయడంలో తోపవని, భూతులు మాట్లాడంలో టాపవని, ఇందులో ఎవరికి అనుమానం లేదన్నారు. రుణమాఫీ చేయలేక చేతులెత్తేసినందుకు నువ్వు రాజీనామా చేయాల్సింది పోయి, సిగ్గులేక చోర్ ఉల్టా కొత్వాల్ కో డాంట అన్నట్లు నన్ను రాజీనామా చెయ్యమంటున్నవని దుయ్యబట్టారు.

> "మాఫీ మొత్తం కోతలమయం. చెప్పింది కొండంత.. చేసింది గోరంత. ఎన్నికల ప్రచారంలో మాట్లాడింది ఒకటి., కేబినెట్ సమావేశాల తర్వాత ప్రకటించింది మరోటి.., బడ్జెట్ కేటాయింపుల్లో చూపింది ఇంకోటి.., ఆఖరుకు చేసింది ఇంకోటి. మీరు మాట్లాడిందే మీకు గుర్తు చేస్తే తప్పా..? మీరేం చేసినా చూస్తూ కూర్చోవాలిగానీ, ఇదేంటని మాత్రం ప్రశ్నించొద్దా..? ఇదేనా దేవుళ్ల మీద ఒట్లేసి తీరు., ఇదేనా అన్నం పెట్టే రైతు దేవుడికి మీరిచ్చే భరోసా..? దాడులతో భయపడేది లేదు., బెదిరింపులకు తగ్గేది లేదు. రైతు పక్షాన నిలుస్తాం., తెచ్చుకున్న తెలంగాణలో ఎవరికి అన్యాయం జరగకుండా కాపాడుకుంటాం."
>
> - మీడియా సమావేశంలో మంత్రి హరీష్ రావు



**దాడులు చేస్తే పెట్టుబడులొస్తాయా..**

రైతుల తరుపున రుణమాఫీ చెయ్యాలని ప్రశ్నిస్తే గుండాలతో దాడులకు పురామాయించి గొప్పతనం నీదన్నారు. దాడులు చేస్తే పెట్టుబడులు వస్తాయా..? అమెరికా పోయింది పెట్టుబడులకా లేక, దాడుల గురించి నేర్చుకోడానికా అని ప్రశ్నించారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, దాడులు కొత్తకాదు.., దాడులకు భయపడం., రైతుల తరుపున పోరాటం ఆపం అన్నారు. ఇకముందు ఇలాంటివి జరిగితే తీవ్ర పరిణామాలుంటాయనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు.

**అన్నీ కోతలే..**

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నాడు రుణమాఫీ అయిపోయిందని ప్రకటిస్తే సంతోషించానని, కానీ లెక్కలు చూస్తే కేవలం 17వేల కోట్లతో 22లక్షల మందికి చేసి లక్షలాది రైతులకు అన్యాయం చేశాడన్నారు. పార్లమెంట్ ఎన్నికలప్పుడు రైతుల సంఖ్య 47లక్షలని చెప్పి, ఇప్పుడు కేవలం 22 లక్షల మందితో సరిపెట్టాడన్నారు. కనీసం చెప్పిన లెక్కలో సగం కూడా చేయలేదని దుయ్యబట్టారు.



# అటెన్షన్.. హైటెన్షన్..

**సిద్దిపేటలో ఫ్లెక్సీ ఫైట్..**

## రాతల యుద్ధం..

- పోటాపోటీగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫ్లెక్సీల ఆవిష్కరణలు..
- రాత్రికి రాత్రి రాష్ట్రమంతా పోస్టర్లు..
- హరీశ్ క్యాంప్ ఆఫీస్ పై కాంగ్రెస్ నాయకుల దాడి..

**జనపదం, సిద్ధిపేట:** రైతు రుణమాఫీతోపాటు 6 గ్యారంటీలు, 420 హామీలను ఆగస్టు 15లోపు అమలు చేస్తే తన ఎమ్మెల్యే పదవి రాజీనామా చేస్తానని హైదరాబాద్ అమరవీరుల స్తూపం సాక్షిగా హరీశ్‌రావు సవాల్‌కు కాంగ్రెస్ పార్టీ వక్ర భాష్యం చెబుతున్నది. ఇందులో భాగంగా రుణమాఫీ చేశాం హరీశ్‌రావు రాజీనామా చేయాలంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తోంది. కాంగ్రెస్ గూండాలు సిద్దిపేటలోని ఎమ్మెల్యే ఆఫీస్‌పై దాడికి పాల్పడ్డారు. గేటును కాళ్లతో తన్నుతూ లోపలికి ప్రవేశించిన హస్తం పార్టీ కార్యకర్తలు ఆఫీస్‌పై ఉన్న హరీశ్‌రావు ఫ్లెక్సీని చించేసి హంగామా చేశారు. హరీశ్‌రావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడి జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం కొసమెరుపు. కాగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు క్యాంపు కార్యాలయానికి చేరుకొని నిరసనకు దిగారు.

**కాంగ్రెస్ ఫ్లెక్సీలకు పోలీసుల కాపలా..**

హరీశ్‌రావుపై తప్పుడు ప్రచారంలో భాగంగా సిద్దిపేట పట్టణంలో రుణమాఫీ పూర్తి చేశాం., హరీష్ రావు రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజ లారీ కృష్ణ పేరుతో పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం కలకలం రేపింది. వాటిని తొలగించాలంటూ బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. క్యాంపు కార్యాలయం పై అర్ధరాత్రి దాడి, ఫ్లెక్సీల తొలగింపుతో సిద్దిపేటలో హై టెన్షన్ నెలకొంది. దీంతో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలకు పోలీసులు పహరా కాస్తూ రక్షణ కల్పించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశం అయింది.

**నెటిజన్ల ఆగ్రహం..**

**జనపదం, హైదరాబాద్:** సిద్ధిపేటలో హరీష్ రావు క్యాంప్ ఆఫీస్ పై కాంగ్రెస్ శ్రేణుల దాడి, ఫ్లెక్సీల చించివేత., విధ్వంసం ఘటనల పై నెటిజెన్లు తీవ్రంగా రియాక్ట్ అవుతున్నారు. పోలీసు శాఖ అసమర్థతతోనే ఇంతా జరుగుతోందని పెదవి విరుస్తున్నారు. ఇంతా జరుగుతుంటే రక్షకభటులు ఏం చేస్తున్నారని, శాంతి భద్రత పరిస్థితిని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నిస్తున్ను. హైదరాబాద్‌లో పనిచేసిన యూకే మాజీ హై కమిషనర్ ఆంద్రూ ఫ్లెమింగ్ ఆ విధ్వంసం ఘటనపై ఆందోళన వ్యక్తం చేయడం బాధాకరం. ఆయన తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ లో స్పందించారు. ఇలాంటి వీడియోలు చూస్తూ నిద్రలేవడం బాధాకరమని అన్నారు. హరీశ్ రావు తో ఎంతో పరిచయం ఉందని, ఆయనపై తనకు వ్యక్తిగతంగా అమితమైన గౌరవం ఉన్నట్లు ఫ్లెమింగ్ తన ట్వీట్‌లో వెల్లడించారు.

## సీఎంవి చిల్లర మాటలు

- డెవర్షన్ పాలిటిక్స్ లో రేవంత్ సిద్ధహస్తుడు..
- మాఫీ ఫ్లాప్..
- సాఫీ అని నిరూపిస్తే రాజీనామాకు రెఢీ
- బీజేఎల్పీ మహేశ్వర్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్ :** రుణ మాఫీ పూర్తిగా చేయలేదని రైతుల్లో చర్చ జరగకుండా సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీ విలీనం అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని బీజేపీఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన మాట్లాడుతూ తప్పుదోవ పట్టించే రాజకీయాల్లో రేవంత్ సిద్ధహస్తుడు. రుణ మాఫీ మొత్తం చేశామని ఎవరు చెప్పినా అబద్ధమే. మొత్తం రైతులకు రుణ మాఫీ కాలేదని చాలెంజ్ చేస్తున్నా. మాఫీ పూర్తిగా అయినట్టు నిరూపిస్తే రాజీనామా చేయడమే కాదు., రాజకీయాల నుంచి తప్పుకుంటా అని ప్రకటించారు. తన సవాల్ కు ముందుకు రావాలని, కాంగ్రెస్ నుంచి సీఎం సహా ఎవరొచ్చినా తాను చర్చకు పెడతానన్నారు.


**అసలు రూపం బయటపడింది..**

కాంగ్రెస్ రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. అన్ని దేవుళ్ల మీద ఒట్టేసి రుణమాఫీ చేస్తానని రేవంత్ చెప్పారని, ఆయన లెక్కల ప్రకారమే తెలంగాణలో 60 లక్షల మంది రైతులున్నారని, అందరికీ రుణ మాఫీ కావాలనే రూ.49 వేల కోట్లు అవసరం అవుతుందన్నారు. అలాంటిది కేవలం రూ.17 వేల కోట్లతో మాఫీ చేసి రైతాంగాన్నే మోసం చేసిందన్నారు. వరంగల్ లో సభ ఎప్పుడు పెడతారో చెప్పాలని, రుణమాఫీ చేయని రైతులతో కనిపిస్తామన్నారు. వెంటనే మాఫీ అయిన అర్హుల జాబితాను బయట పెట్టాలన్నారు. రుణమాఫీ చేయలేదు కాబట్టే రేవంత్ కట్టుకథలు చెబుతూ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులకు ప్రేరేపిస్తున్నారని మహేశ్వర రెడ్డి దుయ్యబట్టారు.

# ఆటోను ఢీకొన్న లారీ..

- బస్సుకిందకు దూసుకెళ్లిన త్రీవీలర్..
- విద్యార్థిని మృతి.. డ్రైవర్ కు తీవ్ర గాయాలు..
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు..





జనపదం, హైదరాబాద్: హైదరాబాద్ హబ్సిగూడ సిగ్నల్ వద్ద ఘోర ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ఆటోను మరో వాహనం ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న పదోతరగతి విద్యార్థిని సాత్విక అక్కడికక్కడే మరణించగా, ఆటో డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. సిగ్నల్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనకాలే ఆగిన ఆటో ను టస్కర్ లారీ ఢీ కొట్టింది. దీంతో ఆటో ఆర్టీసీ బస్సు కిందికి చొచ్చుకెళ్లింది. దీంతో ఆటోలో ఉన్న విద్యార్థిని చనిపోయింది. మరణించిన బాలిక తార్నాక కు చెందిన సాత్విక, హబ్సిగూడలోని గౌతం మోడల్ స్కూల్ లో 10వ తరగతి చదువుతున్నట్టుగా గుర్తించారు. కాగా, ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

